

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    E-mail : netinijam93@gmail.com





హైదరాబాద్ బుధవారం 26-8-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక : 20 పేజీలు: 4 వెల: రూ.1/-


# కులవృత్తులను ప్రోత్సహిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

### త్వరలోనే రెండోదశ గొర్రెల పంపిణీ కార్యక్రమం
### యానిమల్ హెల్త్ కార్డు విధానం తీసుకొస్తాం
### భువనగిరి చెరువులో చేపలు వదిలిన మంత్రి తలసాని

యాదాద్రి భువనగిరి,ఆగస్ట్ 25(ఆర్ఎన్ఎ): గ్రామీణ ప్రాంతాల్లోని కుల వృత్తులకు చేయూత నిచ్చేలా దేశంలో ఎక్కడా లేని విధంగా నిధులు కేటాయించి అభివృద్ధికి దోహద పడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రెండో దశ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని.. యానిమల్ హెల్త్ కార్డు విధానం కూడా త్వరలో ప్రవేశపెడతామన్నారు. కరోనా కాలంలోనూ కోటి రెండు లక్షల ఎకరాల పంటను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. భారతదేశ చరిత్రలోనే వెయ్యి కోట్లతో యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం నిర్మిస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. సబ్బండ వర్ణాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భువనగిరి పట్టణ పరిధిలోని తీనం చెరువులో మంత్రి చేప పిల్లలను వదిలారు. ప్రతి చెరువు, చెక్ డ్యాం, రిజర్వాయర్‌లలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాబోయే రోజుల్లో రొయ్యలను కూడా జలాశయాల్లో పెంచుతామన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడల ప్రదర్శనలో డెయిరీ రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మత్స్య కారుల జీవనభృతి మెరుగుపడాలని రాష్ట్రంలోని చెరువుల్లో చేపలను వదులుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. రైతులకు రైతుబీమా, రైతుబంధు, పెట్టుబడి సహాయం అందించడం దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. 2018లో మత్స్య కారులకు రూ. 900 కోట్లతో అన్నిరకాల పనిముట్లు అందజేశామని పేర్కొన్నారు. గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ మొదటి విడత పూర్తయిందన్నారు. రెండో విడత ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతామన్నామని మంత్రి వివరించారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రాన్నిరూ. 1000 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. డీడీలు కట్టిన వారందరికీ గొర్రెల పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. పాడి పై ఆధారపడిన వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని పేర్కొన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. నరేగా కింద అర్హులైన వారందరికీ పశువులు, గొర్రెల షెడ్లను మంజూరు చేస్తామని మంత్రి తలసాని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కలసి వచ్చిన తుఫాన్ వర్షాలు

### కళకళలాడుతున్న ప్రధాన జలాశయాలు

హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): ఇటీవలి తుఫాన్ వర్షాలు కలసి వచ్చాయి. గతకొన్నేళ్లుగా జలకళ తప్పిన ప్రధాన ప్రాజెక్టులు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. వాయుగుండాల కారణంగా కురిసిన వర్షాలతో ఇరు తెలుగు రాష్ట్రాల్లో జలాశయాలు పొంగి పొర్లాయి. శ్రీశైలం,నాగార్జునసాగర్‌లకు భారీగా వరదనీరు చేరింది. శ్రీరాం సాగర్, పులిచింతల, ధవళేశ్వరం వద్ద ఉదీతి పెరిగింది. ఈ వర్షాల కారణంగా కృష్ణా బేసిన్‌లోని దాదాపు అన్ని ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. భారీ వర్షాలు కురవడంతో కర్ణాటక, ఏపీ, తెలంగాణలోని ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద రావడంతో క్రస్టు గేట్ల ద్వారా సాగర్‌కు నీరు విడుదలవుతోంది. ఇటు నాగార్జునసాగర్‌కు కూడా వరదచేరడంతో నిండుకుండలా మారింది. తుంగభద్ర కాస్త పుంజుకున్నా.. ఆల్మట్టి ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగినా.. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వకు చేరుకునేందుకు ఢోకా లేదు. నాలుగైదు రోజులపాటు ఉధృతంగా కొనసాగిన శ్రీరాంసాగర్ ఇన్‌ఫ్లో రెండు, ఎగువన సాగర్ వరకు ఇన్‌ఫ్లోలు ఉండటంతో పాటు పులిచింతల దిగువన ప్రకాశం బ్యారేజీకి కూడా భారీ ఇన్‌ఫ్లోలు నమోదయ్యాయి. మరోవైపు గోదావరి ఉగ్రరూపం తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం నుంచి అధికారులు సముద్రంలోకి వదులుతున్నారు.

# కొత్తగా 2,579 కరోనా పాజిటివ్‌కేసులు

### తాజాగా 9 మంది మృతి

హైదరాబాద్,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 2,579 కరోనా పాజిటివ్‌కేసులు నిర్ధారణ అయినట్లు వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది. కేవలం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే 295 నమోదయ్యాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,08,670 పాజిటివ్ కేసులు నిర్ధారణ కాగా, వైరస్ ప్రభావంతో తాజాగా 9 మంది మృతి చెందగా, మొత్తం మరణించిన వారి సంఖ్య 770కి చేరింది. మరో 1,752 మంది వైరస్ బారినుంచి కోలుకొని ఇళ్లకు వెళ్లగా, మొత్తం 84,163 మంది డిశ్చార్జి అయ్యారు. మరో 23,737 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ఇంట్లో, ఐసోలేషన్‌కేంద్రాల్లో 17,226 మంది ఉన్నారు. గడిచిన 24 గంటల వ్యవధిలో 52,933 మందికి కొవిడ్ -19 పరీక్షలు చేయగా, ఇప్పటివరకు 10, 21,054 మందికి టెస్టులు చేసినట్లు పేర్కొంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జీహెచ్ఎంసీ పరిధిలో 295, రంగారెడ్డి జిల్లాలో 186, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల్లో 106 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వివరించింది. భద్రాద్రి కొత్తగూడెంలో 83, ఖమ్మంలో 161, వరంగల్ అర్బన్ జిల్లాలో 143, వరంగల్ గ్రామీణ జిల్లాలో 31, ఆదిలాబాద్ జిల్లాలో 34, జగిత్యాల జిల్లాలో 98, జనగామా జిల్లాలో 46, జోగులాంబా గద్వాల జిల్లాలో 47, నల్గొండ జిల్లాలోలో 129, కామారెడ్డి జిల్లాలో 64, సిద్దిపేట జిల్లాలో 92, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 59, పెద్దపల్లి జిల్లాలో 85, సూర్యాపేట జిల్లాలో 78, నిజమాబాద్ జిల్లాలో 142, మహబూబాబాద్ జిల్లాలో 81, మహబూబనగర్ జిల్లాలో 69, నారాయణపేట జిల్లాలో 19, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 10, మెదక్ జిల్లాలో 42, ములుగు జిల్లాలో 16, నిర్మల్ జిల్లాలో 28, సంగారెడ్డి జిల్లాలో 30, వికారాబాద్ జిల్లాలో 23, వనపర్తి జిల్లాలో 56, యాదాద్రి భువనగిరి జిల్లాలో 46, నాగర్‌కర్నూల్ జిల్లాలో 48, మంచిర్యాల జిల్లాలో 104, కరీంనగర్ జిల్లాలో 116, కామారెడ్డి జిల్లాలో 64, భూపాలపల్లి జిల్లాలో 12, జగిత్యాల జిల్లాలో 98, ఆదిలాబాద్ జిల్లాలో 34 కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది.

# ప్రశాంత్ భూషణ్ కేసులో ముగిసిన వాదనలు

### తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కోర్టు ధిక్కరణ కేసులో సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్‌కు శిక్ష ఖరారుపై తీర్పును సుప్రీం కోర్టు రిజర్వ్ చేసింది. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం శిక్ష ఖరారుపై ఇవాళ విచారణ ముగించింది. సుప్రీం కోర్టు జడ్జీలు, కోర్టులపై ప్రశాంత్‌భూషణ్ చేసిన ట్వీట్లను అత్యున్నత ధర్మాసనం సుమోటోగా తీసుకుంది. సద్విమర్శలో తప్పులేదు.. కానీ, ఉద్దేశాలు ఆపాదించడం సరికాదని జస్టిస్ అరుణ్ మిశ్రా స్పష్టం చేశారు. ఎవరినైనా బాధపెట్టినప్పుడు క్షమాపణ చెప్పడంలో తప్పులేదన్నారు. క్షమాపణ పలు సందర్భాల్లో దివ్య ఔషధంగా పని చేస్తుందని వ్యాఖ్యానించారు. అయితే న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ తన ప్రకటనను ఉపసంహరించుకోలేదు. నిజాయతీతో కూడిన ప్రకటననే కోర్టుకు ఇచ్చారని ఆయన తరఫు న్యాయవాది రాజీవ్ ధావన్ న్యాయస్థానానికి వివరించారు. సుప్రీం న్యాయమూర్తులు, కోర్టులపై ప్రశాంత్ భూషణ్ చేసిన ట్వీట్లను కోర్టు ధిక్కరణగా పరిగణిస్తూ సుప్రీంకోర్టు ప్రశాంత్‌భూషణ్‌ను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. దీనిపై క్షమాపణ చెప్పాలని, తన ప్రకటనపై పునరాలోచన చేయాలని ప్రశాంత్ భూషణ్‌కు ఈనెల 24వరకు గడువు ఇచ్చింది. తాను క్షమాపణ చెప్పేదిలేదని, సుప్రీం తీర్పుకే కట్టుబడి ఉంటానని ప్రశాంత్ భూషణ్ భీష్మించుకు కూర్చున్నారు. తాజాగా ఆ గడువు ముగిసిన నేపథ్యంలో ఈ రోజు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

## సెల్‌ఫోన్ స్థానంలో బంగారం బిస్కట్

### విమానాశ్రయంలో దొరికిపోయిన ప్రయాణికుడు

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కొత్త కొత్త పద్ధతుల్లో బంగారం స్మగ్లింగ్ చేస్తూ అక్రమార్కులు కస్టమ్ అధికారులు కూడా ఆశ్చర్యపోయేలా చేస్తున్నారు. తాజాగా ఢిల్లీ విమానాశ్రయంలో జరిగిన ఓ ఉదంతం ఇందుకు మంచి నిదర్శనం. శతకోటి దరిద్రాకలు అనంతకోటి ఉపాయలన్నట్లుగా స్మగ్లర్లు ఎత్తులు వేస్తున్నారు. ఓ వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ కస్టమ్స్ అధికారులకు చిక్కాడు. సెల్‌ఫోన్ బ్యాటరీ స్థానంలో బంగారం బిస్కెట్ పెట్టి గుట్టుచప్పుడు కాకుండా పని కానిచేద్దామనుకున్న అతడి తీరును చూసి అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. దుబాయ్ నుంచి అతడు అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్నట్టు వారు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు.. అతడి నుంచి దాదాపు 505 గ్రాముల బరువున్న బంగారం బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## అమెరికాలో హైదరాబాద్ యువకుడి మృతి

హైదరాబాద్,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ): అమెరికాలోని న్యూజెర్సీలో హైదరాబాద్ యువకుడు అనుమానా స్పదంగా మృతి చెందాడు. అతను ఇన్ఫోసిస్ సంస్థలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. అతడి పేరు ముళ్లపూడి కౌశిక్ అలియాస్ వెంకటరామ కృష్ణగా గుర్తించినట్లు సమాచారం. అతడు మల్కాజిగిరి డివిజన్ లోని మౌలాలికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. కౌశిక్ ప్రమాదవశాత్తు మృతి చెందాడా.. లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తుందని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని అక్కడే ఉంటున్న తెలుగు వ్యక్తి రాకేష్ కిలారు పేర్కొన్నారు. కౌశిక్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని, అయితే ఇంకా వారికి పూర్తి వివరాలు తెలియవని ఆయన తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి గల కారణాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

# కోవిడ్ నిబంధనల మేరకు అసెంబ్లీ సమావేశాలు

### జాగ్రత్తలు తీసుకుంటూనే నిర్వహణ: గుత్తా

నల్లగొండ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): వచ్చే నెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు అన్ని జాగ్రత్తలు తీసుకుని, కొవిడ్ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు. సమావేశాల నిర్వహణపై ఎవరికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు ఉభయసభల్లో సీటింగ్ అరేంజ్‌మెంట్ జరుగుతోందన్నారు. నల్లగొండలోని తన నివాసంలో మీడియా సమావేశంలో గుత్తా మాట్లాడారు. సమావేశాల నిర్వహణపై కొందరు వ్యక్తం చేస్తున్న సందేహాలపై వివరణ ఇచ్చారు. సమావేశ మందిరం ఎంట్రెన్స్ లోనే ఆటోమేటిక్ థర్మల్ స్క్రీనింగ్ మిటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మాస్కులు లేకుండా వచ్చే వారిని మిషన్లు ఆటోమేటిక్ గా గుర్తిస్తాయని తెలిపారు. నిర్దిష్టమైన సీటింగ్ కెపాసిటీ ఉన్న లోకసభ సమావేశాలకు కూడా నిర్వహించ బోతున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మన అసెంబ్లీ 294 మంది సభ్యుల కోసం రూపొందించిన మందిరం కాబట్టి ఇపుడు ఉన్న 120 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలకు ఇబ్బంది ఉండబోదని పేర్కొన్నారు. అయినా అసెంబ్లీ సమావేశాలు అనగానే తగు జాగ్రత్తలు తీసుకుంటామని అందరికీ తెలుసన్నారు. దీనిపై అనవసర భయాలు వద్దన్నారు.

ఈ ఏర్పాట్లను శాసనసభ వ్యవహారాల మంత్రి ప్రశాంత్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారి పరిశీలిస్తు న్నారని, అలాగే తానూ, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కలిసి పరిశీలించిన తర్వాత ఏర్పాట్లు జరుగుతున్నా యని చెప్పారు. ఆటోమేటిక్ టెంపరేచర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని గుత్తా తెలిపారు. కోవిడ్ నిబంధనల ప్రకారమే సభలు జరుగుతాయని మరొక్కసారి స్పష్టం చేశారు. శ్రీశైలం పవర్ హౌస్ ఘటన దురదృష్టకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. చనిపోయిన వారందరికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని, వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. ఇలాంటి ఘటనలపైనా విమర్శలు తగవన్నారు. ఇది ఓ విపత్కర పరిస్థితి అన్నారు.

# ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

రాయ్‌పూర్, ఆగస్టు 25: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. కరోనా నేపథ్యంలో సభలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభ్యుల మధ్య భౌతిక దూరం ఉండేలా సీట్లు కేటాయించారు. అలాగే ప్రతి ఇద్దరు సభ్యులు మధ్య గాజుతో విభజించారు. అదనంగా ఎనిమిది వరుసల సీటింగ్ ఏర్పాటు చేశారు. కరోనా నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సభ్యులు అసెంబ్లీలోకి ప్రవేశించే ముందు థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించడంతోపాటు ఆక్సిజన్ స్థాయిలను పరీక్షించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర అధికారుల సెక్యూరిటీ సిబ్బందిని లోనికి అనుమతించలేదు.

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సీఎం భూపేశ్ బాఘల్ సభలో ప్రసంగించారు. మరోవైపు కరోనా నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం, అక్రమ మైనింగ్, ఏనుగుల మరణాలతోపాటు పలు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష బీజేపీ సిద్ధమైంది. కరోనా కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. కాగా, ప్రతి రోజు సమావేశాలు ముగిసిన తర్వాత సభ అంతటా శానిటైజ్ చేయనున్నారు.

## బర్నింగే తప్ప ఎర్నింగ్ లేదు: మమతాబెనర్జీ



కోల్‌కతా, ఆగస్టు 25: నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి మరోసారి విమర్శలు గుప్పించారు. గత మార్చి నెలలో దేశంలో కరోనా మహమ్మారి విస్తరణ మొదలైనప్పటి నుంచి తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె చెప్పారు. గత ఐదు నెలలుగా తాము ఎన్నో నష్టాలు చవిచూశామని మమత తెలిపారు. రాష్ట్రంలో గత ఐదు నెలలుగా బర్నింగే తప్ప ఎర్నింగ్ లేదని మమతాబెనర్జి వ్యాఖ్యానించారు. ఇంత నష్టం జరుగుతున్నా కేంద్రం ప్రభుత్వం తగిన సహాయం చేయలేదని, రాష్ట్రాలకు వాస్తవంగా దక్కాల్సిన నిధులను పంపిణీ చేయడంతో విఫలమైందని ఆమె మండిపడ్డారు. కోల్‌కతాలో జిల్లా పరిపాలనాధికారులతో సమావేశంలో మమత ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఎరువులకు ఇబ్బంది లేకుండా పంపిణీ

### తెలంగాణ పథకాలు ఆదర్శం: ఎమ్మెల్యే

మహబూబాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): రైతులకు టీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో ఎరువులు, పురుగుల మందులు పంపిణీ చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. జిల్లాలోని గూడూరు మండలం బొద్దుగొండ గ్రామంలో రైతులకు సబ్సిడీపై ఎరువులు సరఫరా చేసేందుకు ఓడీసీఎంఎస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు పక్షపాతిగా ఉంటూ వ్యవసాయాన్నికొత్త పుంతలు తొక్కిస్తున్నారని పేర్కొన్నారు. సాగుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ప్రభుత్వం ఎరువులు, పురుగుల మందులు అందజేస్తుందని తెలిపారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందకూడదని పేర్కొన్నారు. ఎరువుల పంపిణీని మండల, జిల్లా స్థాయి అధికారులు పరిశీలిస్తూ ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి మార్గదర్శకంలా నిలిచాయని అన్నారు. తెలంగాణ అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతున్నదని అన్నారు. బంగారు తెలంగాణలో అధికారులు, ప్రజాప్రతి నిధులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కర్నాటక కాంగ్రెస్ నేత శివకుమార్‌కు కరోనా

బెంగళూరు,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు కరోనా సోకింది. కరోనా పరీక్ష చేయించుకోగా మంగళవారం పాజిటివ్‌గా రిపోర్టు వచ్చినట్లు ఆయన చెప్పారు. దీంతో బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరినట్లు శివకుమార్ తెలిపారు. ఇటీవల తనను కలిసిన వారు కరోనా పరీక్షలు చేయించుకోవాలని, హోం క్వారంటైన్‌లో ఉండాలని ఆయన సూచించారు. కర్ణాటక సీఎం యెడియూరప్ప, మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధ రామయ్య, ఆయన కుమారుడుతోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కరోనా బారిన పడ్డారు. వారిలో కొందరు కోలుకున్నారు. ఆ రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 2.84 లక్షలు దాటగా 4,800 మందికిపైగా మరణించారు.

## మహారాష్ట్ర పోలీసును వీడని కరోనా

### -తాజాగా మరో 351 మందికి పాజిటివ్

ముంబై,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో కరోనా బారిన పడుతున్న పోలీసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. ప్రతి రోజు వందలాది మంది పోలీసులకు కరోనా సోకుతుండగా ఏక సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. సోమవారం నుంచి మంగళవారం వరకు గత 24 గంటల్లో ఆ రాష్ట్రవ్యాప్తంగా 351 మంది పోలీసులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో కరోనా సోకిన వారి మొత్తం సంఖ్య 14,067కు చేరింది. కాగా చికిత్స పొందుతూ గత 24 గంటల్లో ముగ్గురు పోలీసులు మరణించారు. ఇప్పటి వరకు కరోనాతో చనిపోయిన వారి సంఖ్య 142కు చేరింది. మరోవైపు కరోనా నుంచి 11,356 మంది మహారాష్ట్ర పోలీసులు కోలుకోగా ప్రస్తుతం 2,569 యాక్టివ్ కేసులు ఉన్నాయి. వీరింతా పలు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. మహారాష్ట్రలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 6.82 లక్షలను దాటగా 22 వేల మందికిపైగా మరణించారు.

## బిజెపిలో చేరిన మాజీ ఐపిఎస్

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): తమిళనాడుకు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కుప్పుస్వామి భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లో చేరారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి పీ మురళీధర్ రావు, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు ఎల్ మురుగన్ సమక్షంలో పార్టీలో చేరారు. కర్ణాటకలో 'సింగం'గా పేరొందిన బెంగళూరు మాజీ సౌత్ డీసీపీ అన్నామలై ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు గతేడాది రాజీనామా చేశారు. 2011 బ్యాచ్ యువ ఐపీఎస్ అధికారి అన్నామలై తమిళనాడులోని కరూర్ ప్రాంతానికి చెందినవారు. 2013లో కార్కళ ఏఎస్పీగా సివిల్ సర్వీస్ కెరీర్ ప్రారంభించారు.

# పివి శతజయంతి ఉత్సవాల్లో నేడు సాహితీ సదస్సు

### -తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సమాలోచన సభ నిర్వహించనున్నారు. మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన, ఆగస్టు 26న, ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్‌లో సదస్సు జరగనుంది. తెలంగాణ తేజం మన పీవీ పేరుతో సమాలోచన సభ జరగనుంది.

రాజ్యసభ సభ్యుడు, పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు కే.కేశవరావు, పీవీ తనయుడు ప్రభాకర్ రావు, కూతురు వాణిదేవి, కవి అంపశయ్య నవీన్, రచయిత కల్లూరి భాస్కరం ఈ సదస్సుకు హాజరుకానున్నారు. దేశానికి, రాష్ట్రానికి పీవీ అందించిన సేవలు, సంస్కరణలు, ఇతర అంశాలను ఈ సభలో చర్చించనున్నారు. కార్యక్రమాన్ని కింది సామాజిక మాధ్యమాల్లో చూడవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# బాలికలకు సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, ఆగస్టు 25 : చదువుపట్ల విద్యార్థినులకు ఆసక్తిని పెంపొందించాలని, ఆడపిల్లల పట్ల వివక్ష పోవాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సింగిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వనపర్తి నియోజకవర్గంలోని 100 మంది నిరుపేద 8,9,10 తరగతి ఎస్సీ, ఎస్టీ బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆడపిల్లలు అందరితో సమానంగా వారు స్వేచ్ఛను పొందాలన్నారు.

గురుకుల పాఠశాలలతో తెలంగాణలో విద్యావ్యవస్థ రూపు రేఖలు మారాయన్నారు. సన్నబియ్యం అన్నంతో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు ఆదరణ పెరిగిందన్నారు. రేపటి పౌరుల భవిష్యత్ కోసం సీఎం కేసీఆర్ వినూత్న పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. బాలికలకు హెల్త్ కిట్లు పంపిణీ చేయడం దేశానికే ఆదర్శమన్నారు.

## రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

అనంతపురం,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): జిల్లా జైలులో రిమాండ్ ఖైదీ అక్బర్ బాషా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చోరీ కేసులో అరెస్ట్ అయిన అతను రిమాండ్‌లో ఉన్నాడు. స్వస్థలం పులివెందుల మండలం ఎర్రవాండ్ల కొత్తపల్లి. మంగళవారం మధ్యాహ్నం స్నానపు గదిలో వున్న కిటికీకి లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పలు చోరీల కేసులో పోలీసులు కస్టడీలోకి తీసుకుంటున్నారనే భయంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు

## చరిత్రలో నేటినిజం



కం|| జీవులను జంతువులకొసగు
మాతగ - పర్యావరణపు మానుషిగ - ధీర
జ్యోతులనందెడి మహిళా
నేతగ విఖ్యాతి గానె మనేకాగాంధీ !!

( ఆగష్టు 26 'మనేకా గాంధీ జననం..)



-రాధశ్రీ
సెల్: 9494481210

# పగ్గాలు చేజారకుండా జాగ్రత్త పడ్డ సోనియా !

నేటినిజం
బుధవారం 26-8-2020

కాంగ్రెస్ హైడ్రామాతో ప్రజల్లో దానికున్న విశ్వసనీయత మరింతగా దిగజారింది. సోనియా తమ కుటుంబ గుప్పటినుంచి పార్టీ పగ్గాలు జారిపోకుండా జాగ్రత్త పడ్డారు. తను లేదా తన తనయుడు చేతుల్లో మాత్రమే కాంగ్రెస్ పగ్గాలు ఉండేలా వేసిన ఎత్తుగడలు ఫలించాయి. సీనియర్లు లేఖలు రాయడం..దానిపై వర్కింగ్ కమిటీ చర్చించడం అన్నది ఓ ఫార్స్ అన్నది తేలిపోయింది. తమ గుప్పట్లోనే పార్టీ పగ్గాలు ఉండేలా సోనియా ఆమె అనుయాయులు వేసిన వ్యూహం మేరకు మళ్లీ సోనియాకే పగ్గాలు అప్పగించిన తీరును అర్థం చేసుకోవచ్చు. పార్టీని కుటుంబ పార్టీగానే కొనసాగించాలన్న లక్ష్యం నరనరాన జీర్ణించుకున్న తీరు మరోమారు బయటపడింది. కొందరు కాంగ్రెస్ వృద్దులు సోనియా నీడన బతకడం అలవాటు చేసుకున్నారు. వారికి ఆమె లేదా ఆమె తనయుడు లేదా..ప్రియాంక చేతుల్లో పగ్గాలు ఉంటే ఫర్వాలేదు. కానీ మరో సమర్థ నేత కింద పనిచేయడం వారికి నామోషీ. అందుకే వారే ఈ వ్యూహం నడిపిస్తున్నారు. రాజస్థాన్‌లో వృద్దనేత అశోక్ గెహ్లాట్ వ్యవహారం చూస్తే కాంగ్రెస్‌లో వృద్దతరం ఎంతగా పట్టుటబిగించి ఉందో తెలుసు కోవచ్చు. గతంలో ఓ మారు పివి చేతిలోకి పగ్గాలు రాగానే ఎలాగైనా ఆయనను తప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. సీతారం కేసరిని ముందుకు దింపి తరవాత పగ్గాలు లాగి సోనియా చేతిలో పెట్టారు. ఓ వైపు కాంగ్రెస్ విముక్త భారత్ అంటూ బిజెపి వ్యూహాలు పన్నుతుంటే పార్టీని బలోపేతం చేయడం కన్నా.. సోనియా కుటుంబాన్ని బలోపేతం చేసేలా వృద్ధ జంబుకాలు వ్యూహాలు పన్నడం ఆశ్చర్యంగా కనిపించదు. పార్టీని బలోపేతం చేసిన ప్రజలకు చేరువవుదామన్న దానికన్నా సోనియా కుటుంబంలో పార్టీని పదిలంగా పెట్టి ఆమెను మచ్చిక చేసుకోవడంపైనే వారు ఆలోచన చేస్తున్నట్లుగా వ్యవహారం ఉంది. అందుకే తాజాగా సోనియాకు పగ్గాలు అప్పగించిన తీరు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అంతేనా అంటే కాంగ్రెస్ తీరు మారదన్న విషయం కూడా మరోమారు స్పష్టం అయ్యింది. మొత్తానికి

మరో ఆరు నెలల పాటు సోనియా గాంధీయే అధ్యక్షురాలిగా కొనసాగుతారని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. విస్తృత చర్చ తర్వాత అధ్యక్షురాలిగా సోనియానే కొనసాగాలని మాజీ ప్రధాని మన్మోహన్ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టడం... దానిని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదించడం.. రాహుల్ గాంధీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని సీనియర్లలోని ఓ వర్గం, దేశ వ్యాప్తంగా కార్యకర్తలు కోరుతున్నా రాహుల్ ససేమిరా ఒప్పుకోవడం లేదనడం అంతా వ్యూహాత్మక డ్రామాలగా సాగింది. రాహుల్ గాంధీ ప్రస్తుతానికి అధ్యక్ష బాధ్యతలు చేపట్టరా? చేపడితే ఎప్పుడు చేపడతారు? అన్నది ఆసక్తిదాయక ప్రశ్నను ప్రజలకు వదిలేశారు. అంటే మూడో వ్యక్తికి అవకాశం లేకుండా చేశారు. ప్రస్తుతం నడుస్తున్నదంతా కరోనా కాలం కావడం అన్న కారణంతో వ్యవహారాన్ని ఆరునెలల పాటు వాయిదా వేయించారు. రాహుల్‌గాంధీ పూర్తికాలపు అధ్యక్షునిగా తిరిగి అరంగేట్రం చేస్తారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అప్పటి వరకూ అధ్యక్ష బాధ్యతలను రాహుల్ చేపట్టరని పేర్కొంటున్నారు. దీనిని బట్టి చూస్తే.. కరోనా కాలం పూర్తి కాగానే.. ఏఐసీసీ ప్లీనరీ నిర్వహించి.. రాహుల్ గాంధీని పూర్తి కాలపు అధ్యక్షునిగా ఎన్నుకుంటారని సంకేతాలు వదిలారు. సోనియా చేతుల్లోంచి మళ్లీ రాహుల్ చేతుల్లోకే పగ్గాలు పోతాయన్నది కూడా సుస్పష్టం. అందుకే కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు స్వరాలతో రేగిన ప్రకంపనలు పాలపొంగు మాదిరి చప్పున చల్లారిపోయాయి. పార్టీ తాత్కాలిక చీఫ్‌గా కొనసాగాలని, సంస్థను బలోపేతం చేయడానికి అవసరమైన మార్పులు తీసుకుని రావాలని సోనియా గాంధీని కోరుతూ సోమవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించడంతో పార్టీలో లుకలుకలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే నడుస్తున్న నావకు చిల్లి పడితే దానిని ఎంతోకాం మూయలేరు.

ఎక్కువ మంది సోనియా గాంధీకి మద్దతుగా నిలిచినప్పటికీ.. సమావేశంలో వ్యతిరేక స్వరాలు కూడా వినిపిం చాయి. పార్టీలో మార్పులు కోరుతూ సీనియర్లు లేఖ రాసిన సందర్భంపై రాహుల్ గాంధీ మండి పడడం... సమావేశంలో ఉన్న గులాం నబీ ఆజాద్ కూడా అదే రీతిలో స్పందించడం పార్టీలో ఉన్న అసమ్మతికి నిదర్శనం. ఆజాద్, కపిల్ సిబాల్ లాంటి వారు అసమ్మతి స్వరం వినిపించారంటే ఎంతగా వారు వ్యధకు గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సమావేశం బయట ఉన్న కపిల్ సిబల్ కూడా బహిరంగంగా ట్వీట్ చేశారు. ఇక బీజేపీతో కుమ్మక్కయ్యారని రాహుల్ అన్నట్టుగా వార్తలు వెలువడడంతో సిబల్ వెంటనే స్పందించి ట్వీట్ చేయడం కూడా అంతర్గత పోరుకు సంకేతమేనని చెప్పాలి. ఈ నేపథ్యంలోనే అంతర్గత పోరు బహిరంగం కావడం, ఒక దశలో పార్టీలో దాదాపు 400 మంది సీనియర్లు మూకుమ్మడి రాజీనామాలు చేయబోతున్నారని ప్రచారం కావడంతో రాహుల్ గాంధీ స్వయంగా సిబల్‌తో మాట్లాడడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఘాటుగా చేసిన ట్వీట్లను సిబల్ వెంటనే తొలగించారు. కొద్దిసేపటికే పరిస్థితులు మారిపోయి తాత్కాలికంగానైనా అంతా ఒక్క చేతికిందికి వచ్చేశారు. ఎక్కువ మంది సోనియా గాంధీకి మద్దతుగా నిలిచినప్పటికీ.. సమావేశంలో వ్యతిరేక స్వరాలూ వినిపించాయి. లేఖ రాసిన సమయం, సందర్భంపై రాహుల్ గాంధీ మండిపడ్డ తీరుపైనా నేతలు గుర్రుగా ఉన్నారు. లేఖ రాసినవారు బీజేపీతో కుమ్మక్కయ్యారని కూడా ఆయన ఒకదశలో వ్యాఖ్యలు చేయడంపైనా ఆగ్రహంగా ఉన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారిని రాహుల్ బిజెపి ఏజెంట్లుగా వర్ణించారు. నిజానికి రేపు ఆయన పగ్గాలు చేపట్టాక వీరిని ఆదరిస్తారన్న గ్యారెంటీ లేదు. అందువల్ల కాంగ్రెస్ ఎప్పటికైనా మునిగిపోతున్న నావగానే గుర్తించాలి. అది ఎంతకాలం అన్నది తెలియదు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో అడ్రస్ గల్లంతయ్యింది. ప్రధాన కార్యదర్శి పదవి నుంచి పదోన్నతికి ప్రియాంకా గాంధీ సిద్ధంగా లేరని అంటున్నారు. గాంధీయేతర కుటుంబం నుంచి కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడు వస్తారా? అన్నది కాలమే తేల్చాలి.

## సెప్టెంబర్ 1నుంచి కొత్త విద్యాసంవత్సరం

### కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా క్లాసులు

### ఆన్‌లైన్ క్లాసులతో ప్రారంభం

### 27 నుంచి ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆదేశాలు

### -తెలంగాణ ప్రభుత్వం ప్రకటన



హైదరాబాద్,ఆగస్ట్24(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ పాఠశాలల్లో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. సెప్టెంబర్ 1న ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభించేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 27 నుంచి ఉపాధ్యాయులు కూడా క్రమంగా పాఠశాలలకు హాజరవుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 1 నుంచి పాఠశాల విద్యార్థులకు స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డిజిటల్ క్లాసులు ప్రారంభించనుంది. డిజిటల్ క్లాసులకు ఉపాధ్యాయులు ప్లాన్ సిద్ధం చేయనున్నారు. టీ-శాట్, దూరదర్శన్ వంటి డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ద్వారా క్లాసులు బోధించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఆగస్ట్ 31 తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

మూడో తరగతి, ఆపై స్థాయి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపింది. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే ఈ తరగతులు ఉంటాయని పేర్కొంది. అయితే ఈ తరగతుల ప్రారంభానికి ముందే ఈ నెల 27 నుంచి ఉపాధ్యాయులు స్కూళ్లకు రావాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేసింది. కాగా విద్యా సంవత్సరం ప్రారంభంపై మంత్రివర్గ ఉపసంఘం ఈ నెల 5న భేటీ జరిపిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో విద్యా సంవత్సర ప్రారంభం సహా అడ్మిషన్ల పక్రియ, విద్యా బోధన ఎలా జరపాలి అన్న అంశాలపై ప్రభుత్వం చర్చించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి చిత్రారామచంద్రన్ ప్రకటన విడుదల చేశారు.

## సాగర్‌కు తగ్గిన నీటి ప్రవాహం

### -నీటి విడుదలను తగ్గిస్తున్న అధికారులు

నల్గొండ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. 6 గేట్ల ద్వారా 1 లక్షా 29 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేంద్ర జలవనరుల శాఖ అంచనాల ప్రకారం కృష్ణా నదిలోవరద పోటు తగ్గే అవకాశం ఉండడంతో గేట్ల ద్వారా నీటి విడుదలను క్రమంగా తగ్గిస్తున్నారు. శ్రీశైలం వద్ద గేట్ల ద్వారా నీటి విడుదల నిలిచిపోయే వరకు ఇక్కడ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగేఅవకాశం ఉంది. ఎగువన మహారాష్ట్ర, కర్నాటక, ఏపీల మీదుగా ఇప్పటికే వరద పోటు తగ్గినా ఉధృతి కొనసాగుతోంది. కృష్ణా నదిపై ఉన్న అన్ని రిజర్వాయర్లు పూర్తిగా నిండిపోవడంతో వస్తున్న వరద ప్రవాహాన్ని నిల్వ చేసే అవకాశం లేక వస్తున్నట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ వద్ద 8 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేసిన అధికారులు కొద్ది సేపటి క్రితం రెండు గేట్లు మూసేశారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో 1 లక్ష 45 వేల 468 క్యూసెక్కులు.. వస్తుండగా.. 6 గేట్ల ద్వారా? 1 లక్ష 28 వేల 909 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ: 312.0405 టీఎంసీలు.. కాగా ప్రస్తుతం 305.6242 టీఎంసీల నిల్వ ఉంచుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుత నీటిమట్టం 587.20 అడుగులు ఉంది.

## పార్టీలో పరిస్థితులు చక్కబడతాయి: విజయశాంతి

హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో చోటు చేసుకున్న పరిణామాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్ పర్సన్ విజయశాంతి ట్విట్టర్ వేదికగా స్పందించారు. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి గాంధీ కుటుంబం చేసిన సేవలు చిరస్మరణీయం. అయితే ప్రస్తుతం పార్టీలో చోటు చేసుకున్న పరిణామాలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చి పరిష్కారమవుతాయని... పటిష్ట నాయకత్వంతో పార్టీ ముందడుగు వేస్తుందని ఆ బాధ్యత రాహుల్ గాంధీ తీసుకుంటారని విశ్వసిస్తున్నా.. అంటూ విజయశాంతి ట్వీట్ చేశారు.

## జెఇఇ,నీట్ పరీక్షలను వాయిదా వేయండి

### ప్రధాని మోడీకి మమతా బెనర్జీ లేఖ

కోల్‌కత్తా,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): సెప్టెంబరు 1 నుంచి 6 వరకు జరగనున్న జేఈఈ(మెయిన్)ని, సెప్టెంబరు 13న నిర్వహించతలపెట్టిన నీట్‌ను వాయిదా వేయాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కోవిడ్-19 తీవ్రత ఉధృతంగా ఉన్న ఈ తరుణంలో పరీక్షల నిర్వహణ శ్రేయస్కరం కాదని ఆమె లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా సెప్టెంబర్ 30 లోపు టెర్మినల్ ఎగ్జామ్స్ నిర్వహించాలని యూజీసీ జారీ చేసిన మార్గదర్శకాలపై కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో తన అభిప్రాయాన్ని ప్రధానికి స్పష్టం చేసినట్లు ఆమె గుర్తుచేశారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంత వరకూ పరీక్షలను వాయిదా వేయాలని ప్రధానిని మమత కోరారు. సుప్రీంకోర్టు పరీక్షల నిర్వహణకే మొగ్గు చూపుతోంది. జేఈఈ, నీట్ పరీక్షల నిర్వహణపై ఇప్పటికే పచ్చజెండా ఊపింది. ఈ మేరకు కరోనా ఉధృతి కారణంగా జేఈఈ(మెయిన్), నీట్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఆగస్ట్ 17న సుప్రీం కొట్టివేసింది. పదకొండు రాష్ట్రాలకు చెందిన 11 మంది విద్యార్థులు... సెప్టెంబరులో నిర్వహించనున్న జెఈఈ(మెయిన్), నీట్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ అరుణ్‌మిశ్రా ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా కోర్టు పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. కరోనా పేరుతో జీవితం ఆగిపోకూడదు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగాలి. మరో ఏడాది దాకా కరోనా పోయే పరిస్థితులు లేవు. అప్పటి వరకు పరీక్షలను వాయిదా వేయాలంటే ఎలా? విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టలేం, విద్యా సంవత్సరాన్ని వృథా చేయడం ఇష్టం లేదు' అని వ్యాఖ్యానిస్తూ పిటిషన్‌ను బెంచ్ కొట్టివేసింది.

# సొంత వైద్యంతో అసలుకే ఎసరు

### తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయి

### జబ్బు ఏదైనా వైద్యుల సలహాలు తీసుకోవాలి

### వైద్యనిపుణుల హెచ్చరికలు

హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కారోనా కాలంలో ఇంట్లో ఉన్నవారు సొంత వైద్యానికి అలవాటు పడడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆయుర్వేదం, కొందరు అల్లోపతి, మరి కొందరు హోమియోపతి మందులను వాడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కరోనా వస్తే తమకేం కాదులే అన్న ధీమాలో ఉన్నారు. ఇది సరైంది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విజృంభిస్తున్నది. ఇప్పటికే వందల మంది వ్యాధి బారిన పడ్డారు. చాలా మంది సర్కారు వైద్యం తీసుకొని, కొందరు హోం ఐసోలేషన్‌లో ఉండి కోలుకున్నారు. కానీ.. కరోనా సమూహవ్యాప్తి కావడంతో రోజురోజుకూ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికితోడు ఇటీవల వారం రోజులపాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ క్రమంలో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం బారిన పడ్డారు. కొవిడ్-19 అనుమానంతో ప్రాథమికంగా మెడికల్ దుకాణాలకు వెళ్తున్నారు. అజిత్రోమైసిన్, సిట్రోజిన్, పారాసిటమాల్, జింక్, విటమిన్-సీ, మల్టీ విటమిన్, నొప్పుల గోలీలు కొనుగోలు చేస్తున్నారు. రెండు, మూడు రోజులు వాడినా తర్వాత తగ్గకపోవడంతో దవాఖానలకు పరుగెత్తుతున్నారు. వైద్యులు తమ శాయశక్తుల వైద్యం అందిస్తున్నారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఏమి చేయలేని పరిస్థితి. ముందస్తుగానే అనుమానిత లక్షణాలు ఉంటే సర్కారు దవాఖానలో వైద్యం తీసుకొంటే కొంతనైనా ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కరోనా అనుమానిత లక్షణాలు ఉంటే సర్కారు వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ యాంటిజన్ కిట్ల ద్వారా పరీక్షలు చేస్తున్నది. లక్షణాలు తక్కువగా ఉంటే హోం ఐసోలేషన్‌లో ఉండాలని సూచిస్తున్నది. వారికి మందులు కూడా సరఫరా చేస్తున్నది. కరోనా అనుమానంతో ప్రజలు ఇష్టానుసారంగా మందులు వాడుతున్నారు. తుమ్ము, దగ్గు, జ్వరం వస్తే మెడికల్ షాపులకు వెళ్లి ట్యాబ్లెట్లు తీసుకుని వేసుకుంటున్నారు. తగ్గక పోవడంతో దవాఖానకు వెళ్తున్నారు. మెడికల్ షాపుల యజమానులు కూడా ప్రిస్క్రిప్షన్ లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నారు. కానీ.. సొంత వైద్యం మంచిది కాదని.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని.. భవిష్యత్తులో దుష్పరిణామాలు తలెత్తే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. పవర్ ఫుల్ మందులు వాడితే ప్రస్తుతానికి ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. కానీ.. భవిష్యత్తులో ఆ మందులు కూడా పనిచేయవు. వైరస్‌లోడు పెరిగితే చేసేదేమీ ఉండదు. ముందుగానే లక్షణాలు కనిపిస్తే నేరుగా వైద్యులను సంప్రదించాలి. వారిచ్చే సూచనలు, సలహాల మేరకు మందులు వేసుకోవడం మంచిద న్నారు. కరోనా భయంతో ఇష్టానుసారంగా మందులు వాడితే శరీరంలో దుష్పరిమాణాలు కలుగు తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్యులను సంప్రదించాలని, వారి సలహాలు, సూచనల మేరకు మాత్రమే మందులు వాడాలని సూచిస్తున్నారు. అవసరం లేకున్నా మందులు వాడడంతో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని, భవిష్యత్తులో ఏ మందులు వాడినా పనిచేయవని తెలుపు తున్నారు. సొంత వైద్యం ఏ మాత్రం మంచిది కాదని, వివిధ రకాల మందులు వినియోగంతో బీపీ పడిపోవడం, అలర్జీలు రావడం, కడుపునొప్పి, గ్యాస్ సమస్యలు, కిడ్నీ, గుండె, లివర్ లాంటి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా ప్రభుత్వ వైద్యులు, సిబ్బందిని సంప్రదించాలని కోరుతున్నారు. కరోనా నివారణ కోసం ప్రభుత్వం, అధికారుల సూచనలు పాటించాలని మాస్కు ధరించడం, బయట తిరగకుండా ఉండటం, భౌతిక దూరం పాటించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలంటున్నారు.

# కరోనా జాగ్రత్తలు నిరంతరాయంగా చేపట్టాలి

### భౌతిక దూరం, మాస్కు తప్పనిసరి

### కరోనా రోగులపట్ల వివక్ష తగదన్న కలెక్టర్

అనంతపురం,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కరోనా బాధితులపై వివక్ష చూపటం తగదని జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు సూచించారు. జాగ్రత్తలు పాటించకపోతే వైరస్ మరింత వ్యాప్తిచెందే ప్రమాదముందని హెచ్చరించారు. శానిటైజర్ వాడుతూ, మాస్కులు ధరించి, భౌతికదూరం పాటించాలన్నారు. కరోనా కట్టడిలో ప్రజలంతా ఎవరికి వారు భాగస్వాములవాలని కోరారు. కరోనా లక్షణాలున్న వారిని ముందుగా గుర్తిస్తే వైరస్ బారి నుంచి కాపాడే వీలుంటుందన్నారు. పాజిటివ్ వచ్చినవారిని వివక్షతో కాకుండా వివేచన, సానుభూతితో చూడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో కరోనా పరీక్షల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే కరోనా లక్షణాలున్న ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ గంధం చంద్రుడు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పొడి దగ్గు, గొంతునొప్పి, జ్వరం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది తదితర లక్షణాలున్న వారు పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో అన్ని పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శాంపిల్ ఇవ్వొచ్చన్నారు. కొవిడ్-19 మరింత వ్యాప్తి చెందకుండా ఎవరికి వారు రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇంటిని కొవిడ్ దుర్భేధ్యంగా మార్చుకోవాలన్నారు. రోజూ ఉదయాన్నే ఎండలో 20 నిముషాలపాటు శ్వాస వ్యాయామాలు, యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. గోరువెచ్చని నీటినే తాగాలన్నారు. అరగంటకోసారి కొద్దికొద్దిగా రోజులో 5 లీటర్ల వరకూ నీరు తాగాలన్నారు. అల్లం, వెల్లుల్లి, మిరియాలు, సొంటి, పసుపు, లవంగాలను నీటిలో మరిగించి, రెండుమూడు పూటలు తాగాలన్నారు. రాత్రి పడుకునే ముందు గ్లాసు పాలలో చిటికెడు పసుపు కలుపుకుని, తాగాలన్నారు.

శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు కోడిగుడ్లు, పాలు, బాదం, జీడిపప్పు, కిస్‌మిస్ ఎక్కువగా తినాలన్నారు. రాగిజావ తాగాలన్నారు. మరోవైపు జిల్లాలో కరోనా మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. గత రెండు రోజుల్లోనే కరోనా బాధితులు 14 మంది మృతి చెందారు. అలాగే 1486 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అలాగే జిల్లాలో గత రెండు రోజులలో 1162 మంది కరోనా నుంచి కోలుకున్నారు. శనివారం 523 మంది, ఆదివారం 639 మంది కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తదుపరి వైద్య సేవల నిమిత్తం ఒక్కొక్కరికి రూ2 వేలు అందజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో కరోనా నమూనాలు సేకరించారని అన్నారు.



# రైతులకు సరిపడా ఎరువులు : ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబాబాద్, ఆగష్టు 25: రైతులకు టీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో ఎరువులు, పురుగుల మందులు పంపిణీ చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. జిల్లాలోని గూడూరు మండలం బొద్దుగొండ గ్రామంలో రైతులకు సబ్సిడీపై ఎరువులు సరఫరా చేసేందుకు ఓడీసీఎంఎస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు.

రైతు పక్షపాతిగా ఉంటూ వ్యవసాయాన్నికొత్త పుంతలు తొక్కిస్తున్నారని పేర్కొన్నారు. సాగుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ప్రభుత్వం ఎరువులు, పురుగుల మందులు అందజేస్తుందని తెలిపారు.

రైతులు ఎవరు కూడా ఆందోళన చెందకూడదని పేర్కొన్నారు. ఎరువుల పంపిణీని మండల, జిల్లా స్థాయి అధికారులు పరిశీలిస్తూ ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భావితరాలకు మార్గదర్శిగా నిలవండి

### -మొక్కల పెంపకంలో విద్యార్థులు ముందుండాలి

వరంగల్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): మొక్కలను నాటడం ద్వారా విద్యార్థులు భావితరాలకు మంచి వాతావరణం అందించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. విద్యార్థులు ఈ విషయంలో పెద్దలకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. మొక్కలే మన జీవనాధారమని గుర్తించాలన్నారు. కరోనా నేపథ్యంలో ఇంటిపట్టునే ఉంటున్న విద్యార్థులు తమ పరిసరాల్లో మొక్కలు నాటి ఆదర్శంగా నిలవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగం కావాలన్నారు.విద్యార్థుల్ని ఈ ప్రభుత్వం తల్లిదండ్రుల వలె చూసుకుంటుందన్నారు. నాణ్యమైన విద్య, పోషక విలువలు కలిగిన భోజనం, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత కిట్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థుల చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్ ఉందని స్పష్టం చేశారు. అందుకే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగాలని సీఎం కేసీఆర్ సన్నబియ్యంతో కూడిన భోజనాన్ని కడుపునిండా పెడుతున్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు విద్యా రంగాన్ని పటిష్టం చేస్తున్నారు. కరోనాతో తాత్కాలికంగా పాఠశాలలు మూతపడ్డా తరవాత పూర్తి రక్షణ చర్యలతో ప్రారంభిస్తారని, దీని కోసం సిఎం కెసిఆర్ కసరత్తు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. భావి తరాలకు మంచి భవిష్యత్ అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ హరితహారం ప్రారంభించారు. మంచి వర్షాలు పడలన్నా, పర్యావరణం బాగుండాలన్న, పంటలు పండాలన్నా పచ్చదనం ఉండాలి. కనీసం 33 శాతం అడవులు ఉండాలి. కానీ దురదృష్టవశాత్తు తెలంగాణలో ఎక్కడ కూడా 33 శాతం అడవులు లేవు. గోదావరి పరివాహక ప్రాంతంలో అక్కడక్కడా అడవులున్నాయి. ఈ అడవులను పెంచాలని మొక్కలు నాటాలని సీఎం కేసీఆర్ హరితహారం చేపట్టారు. నాటే మొక్కలను మీరు జాగ్రత్తగా పరిరక్షించాలి. ఒక్కో మొక్కను ఒకరు దత్తత తీసుకొని దానిని సంరక్షించాలి అని మంత్రి సూచించారు.

## పంటలవారీగా సాగు విస్తీర్ణం వివరాలు సేకరణ

### ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అధికారులు

వికారాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): జిల్లావ్యాప్తంగా వానకాలంలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇందులో ప్రధానంగా వరి అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కాగా కంది, పత్తి పంటలు 30 శాతం మేర అధికంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వ సూచనలతో ఈసారి మక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. జిల్లాలో 97 క్లస్టర్లలోని సంబంధిత అధికారులు ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేశారనే వివరాలను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో ఫీడ్ చేశారు. గ్రామంలోని ప్రతి రైతును కలిసి వారి భూమికి సంబంధించిన పట్టా పాసు పుస్తకం, పీపీబీ నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో వారికి ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉన్నదనే వివరాలు తెలుస్తాయి. కొంతమంది రైతులకు ఇప్పటికీ పట్టా పాసు పుస్తకాలు రాలేదు. వారికి సంబంధించిన పంటల వివరాలను కూడా సేకరించారు. ప్రతి గ్రామంలోనూ కొన్ని పంటలను వ్యవసాయ విస్తరణాధికారులు స్వయంగా సందర్శించి రైతులు తమకు చెప్పిన వివరాలు, సాగు చేసిన పంటలు ఒకటేనా కాదా అని పరిశీలించి, నిర్ధారించ ుకున్నారు. తద్వారా పక్కాగా సమాచారాన్ని సేకరించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో పంటల సాగు, వివరాల నమోదు పక్రియను తెలుసుకునేందుకు ఈ నెల 4న రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి పరిగి మండలంలో పర్యటించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాల నమోదు పక్రియను తెలుసుకుని, సాగు చేసిన పంటలు సైతం పరిశీలించారు. ప్రతి రైతు సాగు చేసిన పంట వివరాలు సేకరించడంతో వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు దోహదపడుతుంది.కందులు, వరి, పత్తి తదితర వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా సాధ్యమైనంత త్వరగా కొనుగోళు చేపట్టవచ్చని అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి అవకాశం కలుగుతుంది. ఆయా మండలాల వారీగా అవసరమైన మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ఈ వివరాలు ఉపయోగపడతాయి. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించడానికి మరింత అవకాశం కలుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వానకాలంలో నియంత్రిత సాగు విధానంలో పంటలు పండించాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా గ్రామాల్లోని వ్యవసాయాధికారులు, రైతులకు విస్తృతమైన అవగాహన కల్పించడంతో సాగులో మార్పు కనిపించింది. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈసారి సాధారణం కంటే అధిక విస్తీర్ణంలో వివిధ పంటలను రైతులు సాగుచేశారు.

## పాకాల ఆయకట్టు మరమ్మత్తులకు సిద్ధం

### -అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే పెద్ది

వరంగల్ రూరల్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): పాకాల ఆయకట్టు పునరుద్దరణకు చర్యలు తీసుకుంటున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. చెరవు నిండి జలకళ సంతరించుకుందన్నారు. ఆయకట్టు మరమ్మత్తులకు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వ సిద్దంగా ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ఖానాపురం మండలంలోని పాకాల ఆయకట్టు కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి డీపీఆర్ ఇచ్చేందుకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాకాల ఆయకట్టు నుంచి పంటలకు నీరిచ్చే కాలువలు నిర్మించి చాలా సంవత్సరాలు అవుతున్నది. భవిష్యత్‌లో మరింత ఆయకట్టు పెరిగే అవకాశం ఉండటంతో వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు.

అప్పటి నాయకుల నిర్లక్ష్యం వల్ల కాలువలు ధ్వంసమవుతున్నా పట్టించుకోకపోవడం వల్లే అవి శిథిలావస్థకు చేరాయన్నారు. వాటిని కాపాడాల్సిన అవసవం ఇప్పుడు ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. పాకాల నుంచి పంటలకి నీరిచ్చే జాలుబందం, తుంగబందం, పసునూర్, మొట్టు వీరారం, సంగెం కాలువలను పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన నివేదికను తయారు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సమీక్షలో అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ తహసిల్దార్లకు పదోన్నతి

## వేర్వేరు మండలాలకు బదిలీలు

కాకినాడ,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలో పెద్ద ఎత్తు తహసిల్దార్ల బదిలీలు చేపట్టారు. వరదలు, కరోనా నేపథ్యంలో బదిలీలు చేపట్టడం విశేషం. పరిపాలన సౌలభ్యం కోసం సోమవారం రాత్రి 11మంది డిప్యూటీ తహశీల్దార్లకు పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 14మంది తహశీల్దార్లను వేర్వేరు మండలాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. వై.రామవరం డిప్యూటీ తహశీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావును అదే మండలానికి తహశీల్దార్‌గా నియమించారు. రావులపాలెం డిప్యూటీ తహశీల్దార్ టి.సుభాష్‌ను పెదపూడి తహశీల్దార్‌గా నియమించారు.కాకినాడ సెజ్‌లో ఉన్న ఎస్‌వీఎల్‌ఎన్ కుమారిని బిక్కవోలు తహశీల్దార్‌గా, సామర్లకోటలో ఉన్న వై.విశ్వేశ్వరరావు మారేడుమిల్లి తహశీల్దార్‌గా, రాజమహేం ద్రవరం అర్బన్‌లో ఉన్న వై.సరస్వతి గండేపల్లి తహశీల్దార్‌గా, మామిడికుదురులో ఉన్న వై.రామకుమారి రంపచోడవరం సబ్ కలె క్టరేట్‌కు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో ఉన్న వి.అమ్మాజీ సఖినేటిపల్లి తహశీల్దార్‌గా, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ పాపారావు అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ తహశీల్దార్‌గా, పి.గన్నవరంలో ఉన్న బాజి చింతూరు తహశీల్దార్‌గా, కలెక్టరేట్‌లో ల్యాండ్ రీఫార్మ్స్ విభాగ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ కేకే విశ్వశ్వరరావు కలెక్టరేట్‌లో తహశీల్దార్‌గా పదోన్నతి పొందారు. పెదపూడి తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి అనపర్తి మండలానికి, అనపర్తి మండలం తహశీల్దార్ కె.వేదవల్లి రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయానికి, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో ఉన్న కె.పద్మావతి ఉప్పలగుప్తం మండలానికి, మండపేట తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ కోరుకొండ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. అలాగే కోరుకొండ తహశీల్దార్ పీఆర్ రాజేశ్వరరావు మండపేటకు, సఖినేటిపల్లి తహశీల్దార్ ప్రకాష్‌బాబు రాయవరం మండలానికి, రాయవరం తహశీల్దార్ రమణకుమారి ఏజెన్సీ గంగవరం, కాట్రేనికోన తహశీల్దార్ ప్రసాద్ కె.గంగవరానికి, అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో ఉన్న జి.లక్ష్మీపతి ఆలమూరుకు, ఆలమూరులో ఉన్న జె.వెంకటేశ్వరి అమలాపురం ఆర్డీవో కార్యాలయానికి, గండేపల్లి తహశీల్దార్ చిన్నారావు జగ్గంపేటకు, రంపచోడవరం సబ్ కలెక్టరేట్‌లో ఉన్న కె.రఘురామయ్య కలెక్టరేట్‌కు, మారేడుమిల్లి తహశీల్దార్ కేవీవీఆర్ శ్రీనివాస్ కలెక్టరేట్ ల్యాండ్ రీఫార్మ్స్ సెక్షన్‌కు, ఈ సెక్షన్‌లో ఉన్న ముస్తాక్ అహ్మద్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

# పాఠశాలల పునఃప్రారంభం ఇప్పుడే వద్దు

## –సిఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

అమరావతి,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): ఏపీలో రోజు రోజుకు కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో పాఠశాలల పున:ప్రారంభంపై పునరాలోచించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు లేఖ రాశారు. ఏపీలో 3,61,712 కరోనా పాజిటివ్ కేసులు, 3368 మరణాలు సంభవించాయని...ప్రతిరోజు ఏపీలో 8 వేల నుండి 10 వేలకు పైబడి కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయని తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల్లో సెప్టెంబర్ 5 నుండి పాఠశాలలు ప్రారంభించటం సరికాదని సూచించారు. రాష్ట్రంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది కరోనా బారిన పడ్డారన్నారు. అనంతపురం జిల్లాలో టీచర్ చారుమతి, కృష్ణా జిల్లాలో ఇంటూరి ప్రతాప్ అనే టీచర్ మృతి చెందటం విచారకరమని ఆయన అన్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రికి కూడా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని చెప్పారు. అమెరికాలో పాఠశాలలు తెరిచిన 15 రోజుల్లో లక్ష మంది పిల్లలకు కరోనా సోకడం గమనార్హమని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు అనుమతిచ్చి కరోనా వ్యాప్తికి కారణమైందని విమర్శించారు. కరోనా పూర్తిగా నివారించబడే వరకైనా లేదా వ్యాక్సిన్ వచ్చే వరకైనా పాఠశాలల పున:ప్రారంభం వాయిదా వేయడం మంచిదని రామకృష్ణ లేఖలో పేర్కొన్నారు.

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారీ నిరసనలు

## చైనా ప్రాజెక్టులపై గళమెత్తిన ప్రజలు

## కాగడాల ప్రదర్శనతో చైనా గో బ్యాక్ నినాదాలు

ముజఫరాబాద్,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): నీలం-జీలం నదిపై చైనా సంస్థలు నిర్మించనున్న మెగా డ్యామ్‌లను వ్యతిరేకిస్తూ పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ముజఫరాబాద్‌లో సోమవారం రాత్రి భారీ ఎత్తున నిరసనలు చేపట్టారు. 'దర్యా బచావో.. ముజఫరాబాద్ బచావో' నీలం-జీలం బహ్నే దో.. హుమెన్ జిందా రెహ్నేదో' అంటూ నినాదాలు చేస్తూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో సుమారు వెయ్యి మందికిపైగా పీవోకేలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. ఇటీవల పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆజాద్ పట్టాన్, కోహలా హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి పాకిస్థాన్, చైనాలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ)లో భాగంగా 700.7 మెగావాట్ల సామర్థ్యం గల ఆజాద్ పటాన్ హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఈ ఏడాది జూలై 6న ఒప్పందం కుదిరింది. ప్రాజెక్టులకు 1.54 బిలియన్లు చైనాకు చెందిన గెజౌబా గ్రూప్ కంపెనీ (సీజీజీసీ) సమకూర్చనుంది. జీలం నదిపై నిర్మించ తలపెట్టిన కోహలా జలవిద్యుత్ ప్రాజెక్టు, పాకిస్తాన్ రాజధాని నగరం ఇస్లామాబాద్ కు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుధానోతి జిల్లాలో ఆజాద్ పట్టాన్ వంతెనకు సుమారు 7 కిలోమీటర్ల ఎగువ ప్రవాహంలో ఉంది. 2026 నాటికి పూర్తి కానున్న ఈ ప్రాజెక్టు చైనా త్రీ గోర్జెస్ కార్పొరేషన్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్ సీ), సిల్క్ రోడ్ ఫండ్‌ల ద్వారా స్పాన్సర్ చేయనుంది. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చైనా ఉనికి, భారీ ఆనకట్టల నిర్మాణం, నదీ మళ్లింపు వారి ఉనికికి ముప్పుగా భావిస్తున్నారు. చైనా పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ నేపథ్యంలో పాక్, చైనా సంయుక్తంగా పీవోకే, గిల్గిట్, బాల్టిస్థాన్‌ల సహజ వనరులను కొల్లగొట్టాయి. దీంతో పాక్, చైనాలపై పీవోకే భూభాగంలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

# భూ ఆక్రమణ చేసిన పెద్ద లెవరు: దేవినేని

అమరావతి,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): విశాఖలో 108 ఎకరాలు ఆక్రమించిన ఫార్మా కంపెనీ వెనుక పెద్దలెవరని ట్విట్టర్ వేదికగా మాజీ మంత్రి దేవినేని ఉమ నిలదీశారు. విశాఖలో 108 ఎకరాలు ఆక్రమించిన ఫార్మా కంపెనీ వెనుక పెద్దలు ఎవరు? ప్రభుత్వం మారగానే చకచకా కదిలారు. భూములిచ్చేది లేదని నాలుగు గ్రామాలంటున్నా ఎకరా 50లక్షలు చేసే భూమిని 18లక్షలకే అధికారులు ఎలా కేటాయిస్తారు? ప్రజావసరాలకు ఉపయోగించే భూములను ఆక్రమించుకున్న సంస్థపై ఏం కేసులు పెట్టారో చెప్పండి అని దేవినేని ఉమ ట్వీట్ చేశారు.

# శిరోముండనం కేసును పార్లమెంటులో ప్రస్తావించాలి

## –కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు వర్ల లేఖ

అమరావతి,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): శిరోముండన కేసు గురించి పార్లమెంటులో ప్రస్తావించాలంటూ భారత పార్లమెంటులో దళిత ఎంపీల ఫోరం అధ్యక్షులు, కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య లేఖ రాశారు. అసలు ముద్దాయిని అరెస్ట్ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, బాధితుడు రాష్ట్రపతికి మొరపెట్టుకున్న న్యాయం జరగలేదని అన్నారు. రాష్ట్రపతి కార్యాలయం కోరినా ప్రభుత్వం న్యాయం చేయలేదని తెలియజేశారు. ఎఫ్‌ఐఆర్‌లో ఉన్న ముద్దాయిలను అరెస్ట్ చేయకుండా తమ పార్టీ వారని ఉపేక్షించిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంటులో ప్రశ్నించి దళిత యువకుడికి న్యాయం చేయాలని కోరారు. తనకు న్యాయం జరగక పోతే తాను నక్సలైట్‌లో చేరేందుకు అనుమతి ఇవ్వాలని సాక్షాత్తు రాష్ట్రపతిని బాధితుడు కోరిన విషయాన్ని తెలియజేశారు. సంబంధిత ఎఫ్‌ఐఆర్, బాధితుని లేఖలను కేంద్రమంత్రికి రాసిన లేఖకు వర్ల రామయ్య జత చేశారు.

# పతనావస్థకు చేరుకున్న కాంగ్రెస్: జివిఎల్

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో కాంగ్రెస్ పతనావస్థకు చేరకుందని, కాంగ్రెస్ ప్రతిష్ట మరింత దిగజారిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఎద్దేవాచేశారు. కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదని చాలా మందికి అర్థమైందని, అందుకే కాంగ్రెస్ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమతున్నాయని విమర్శించారు. వంశపారంపర్య పార్టీలకు ఇలాంటి ఇబ్బందులు తప్పవన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష సంక్షోభానికి అంతర్గత రాజకీయాలే కారణమన్నారు. రాహుల్ గాంధీ చేసే పనులతో కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. తెలంగాణలో బీజేపీనే ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని నరసింహారావు చెప్పారు.

# అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## 31నుంచి పవిత్రోత్సవాల నిర్వహణ

తిరుపతి,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. నంతరం ఉదయం 6.00 నుండి 9.00 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమ ంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం తో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.ల్గ÷దరాబాదుకు చెందిన శ్రీ శ్రీనివాసులు , శ్రీమతి శారద దంపతులు ఆలయానికి మంగళవారం ఉదయం 12 పరదాలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో ఝాన్సీరాణి, సూపరింటెండెంట్లు మల్లీశ్వరి, మధు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఆగస్టు 30వ తేదీ సాయంత్రం అంకురార్పణం జరుగనుంది. యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక జరిగే దోషాల ప్రభావాన్ని నివారించడానికి ప్రతి ఏడాదీ మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆగస్టు 31వ తేదీన పవిత్రప్రతిష్ఠ, సెప్టెంబరు 1న పవిత్ర సమర్పణ, సెప్టెంబరు 2న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగనున్నాయి. కోవిడ్ 19 వైరస్ వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా పవిత్రోత్సవాలు ఏకాంతంగా నిర్వహిస్తారు.

# సెప్టెంబర్ నెలాఖరుకు అదుపులో కరోనా

## రాష్ట్రంలో కరోనా మరణాలు 0.7 శాతం మాత్రమే

## కరోనా నివారణ చర్యలపై తప్పుడు ప్రచారం తగదు

## ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు

హైదరాబాద్,ఆగస్ట 25 (ఆర్‌ఎన్‌ఎ):సెప్టెంబరు నెలాఖరునాటికి రాష్ట్రంలో కరోనా అదుపులోకి వచ్చే అవకాశముందని ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు చెప్పారు. కొవిడ్‌పై ప్రజల్లో చాలా వరకు అవగాహన పెరిగిందని, రానున్న రోజుల్లో కూడా ఇదే విధంగా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. బయటకు వెళ్లిన సమయంలో తప్పనిసరిగా భౌతిక దూరం పాటిస్తూ.. మాస్కులు ధరించాలని సూచించారు. కొవిడ్ బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, జీహెచ్‌ఎంసీ పరిధిలో కొవిడ్‌ను దాదాపు అదుపులోకి తీసుకొచ్చామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కొవిడ్ కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కరోనా పరీక్షల సంఖ్య గతంలో కంటే పెంచామని, రాష్ట్రంలో ఇప్పటి వరకూ 10.21 లక్షల కరోనా పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనల మేరకే బిల్లులు వేయాలని, ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందిస్తున్నామని శ్రీనివాసరావు వెల్లడించారు. మరికొన్ని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకునే అవకాశముందన్నారు. తెలంగాణలో కరోనా మరణాల రేటు జాతీయస్థాయి రేటు కన్నా తక్కువగానే ఉందన్నారు. కరోనా నివారణకు చర్యలు తీసుకోవట్లేదని తప్పుడు ప్రచారం చేస్తే బాధనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరోనా మరణాలు 0.7 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిరోజు 40 వేల పరీక్షలు చేస్తున్నాం..మొత్తం పరీక్షల్లో, 50 శాతం పరీక్షలు ఆగస్టు నెలలోనే జరిగాయని శ్రీనివాస్ వెల్లడించారు. వైద్య సిబ్బంది కరోనా పై అలుపెరగని యుద్ధం చేస్తోందన్నారు. 2 వేలకు మందికి పైగా వైద్య సిబ్బంది ఇప్పటివరకు కరోనా బారిన పడ్డారని తెలిపారు.

కరోనాతో చనిపోయిన వైద్య సిబ్బంది కుటుంబాలను ఆదుకుంటాం..ప్రభుత్వం త్వరలోనే ప్రకటన చేయనుందని పేర్కొన్నారు. ప్రయివేట్ ఆస్పత్రుల పై వస్తున్న ఫిర్యాదులను విచారణ చేస్తున్నాం..ఇప్పటికి ప్రతి రోజు 5 నుంచి 8 వస్తున్నాయని వెల్లడించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు. 50 శాతం బెడ్ల అధీనం పై చర్చలు జరుగుతున్నాయి..ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసకుంటున్నామని తెలిపారు. ఈ సీజన్‌లో చికెన్ గున్యా, డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనా, సీజనల్ జ్వరాల లక్షణాలు ఒకే విధంగా ఉంటాయని, ఎలాంటి క్షణాలు ఉన్నా సమీపంలోని ప్రభుత్వం ఆరోగ్యకేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని శ్రీనివాసరావు తెలిపారు.

# కరోనా చికిత్సలకు అధికంగా వసూలు చేస్తే చర్యలు




స్పదంన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సిఎం వైఎస్ జగన్.

## ఫిర్యాదులపై తక్షణం కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి

## స్పందన కార్యక్రమంలో కలెక్టర్లతో సిఎం జగన్

అమరావతి,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): కోవిడ్ చికిత్సలకు అధిక రేట్లు వసూలు చేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ ఆస్పత్రుల నిర్వహణపై కలెక్టర్లు దృష్టి పెట్టాలని సూచించారు. స్పందన కార్యక్రమంపై మంగళవారం సీఎం జగన్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీవోలో పేర్కొన్న దాని కంటే.. కోవిడ్ రోగుల వద్ద నుంచి ఎక్కువ వసూలు చేస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కరోనా బాధితుల పట్ల మానవత్వం చూపించాలన్నారు. కోవిడ్ బాధితుడికి అరగంటలోగా బెడ్ ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదే అని తెలిపారు. 104, 14410 కాల్ సెంటర్లకు వచ్చే ఫోన్ కాల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వరదలు, సహాయక చర్యలపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. గోదావరి, కృష్ణా నదిలో వరదలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సెప్టెంబర్ 7లోగా పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని.. గోదావరి వరద ముంపు బాధితులకు 2 వేల రూపాయల అదనపు పరిహారం ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దానితో పాటు రెగ్యులర్‌గా ఇచ్చే రేషన్‌కు అదనంగా 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పామాయిల్, కేజీ ఉల్లి.. కేజీ బంగాళదుంపలు, 2 లీటర్ల కిరోసిన్ ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ 7లోగా నిత్యావసరాలు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ వసతులు దెబ్బతిన్న చోట వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వరద ప్రాంతాల్లో రోగాలు రాకుండా మందులు అందుబాటులో ఉంచుకోవాలని.. వరద తగ్గుముఖం పట్టింది కాబట్టి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయిలో నిత్యావసరాలను పూర్తిస్థాయిలో నిల్వ చేసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి వసతుల క్లోరినేషన్ కోసం చర్యలు చేపట్టాలని సీఎం జగన్ కోరారు.

# తెలంగాణలో మత్స్యకారులకు మంచి రోజులు : మంత్రి కొప్పుల

జగిత్యాల, ఆగష్టు 25 : సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద జగిత్యాల పట్టణంలోని లింగంపేట చెరువులో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో మత్స్యకార్మికులకు మంచి రోజులు వచ్చాయన్నారు.

సీఎం కేసీఆర్ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీ చైర్పర్సన్ వసంత, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



# హర్యానా సిఎం ఖట్టర్‌కు కరోనా

## శ్రీపాదనాయక పరిస్థితి సీరియస్

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో కరోనాకు ప్రముఖులు గురవుతున్నారు. హర్యాన ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కరోనా బారిన పడగా, కరోనాతో కేంద్రమంత్రి శ్రీపాదనాయక్ పరిస్థితి తీవ్రంగా ఉంది.

ఇకపోతే కరోనా రోగుల సంఖ్య 31,24,391 కు పెరిగింది. వీరిలో 23,52,507 మంది నయమవగా, 57,869 మంది మరణించారు. ప్రస్తుతం 7,13,461 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. కాగా, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు కరోనా పాజిటివ్ అని తేలింది. తనకు పాజిటివ్ గా తేలిందన్న విషయాన్ని ఆయన ట్వీట్ ద్వారా సమాచారమిచ్చారు. 'ఈ రోజు కరోనా నిర్ధారిత పరీక్షలు చేయించాను. రిపోర్ట్ పాజిటివ్ గా వచ్చింది. నన్ను సంప్రదించిన వారందరూ సెల్ఫ్ క్వారంటైన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ట్విట్టర్లో ఖట్టర్ తెలిపారు. ఇదిలావుంటే కరోనా బారిన పడిన కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీపాద్ నాయక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. గత 10 రోజులుగా మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు సోమవారం ఆక్సిజన్ లెవల్స్ పడిపోయాయని ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. దీంతో వైద్యుల సూచనల మేరకు ఢిల్లీ ఎయిమ్స్ నుంచి గోవాకు ప్రత్యేక వైద్య బృందం పయనమైంది. ఈ మేరకు శ్రీపాద నాయక్ ఆరోగ్య పరిస్థితిపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావాంత్ ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా ఈ నెల 12వ తేదీన కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీపాద నాయక్ కరోనా బారిన పడిన విషయం తెలిసిందే.

మరోవైపు, దేశంలో పరీక్షల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. ఆగస్టు 21 న ప్రభుత్వం 10 లక్షలకు పైగా పరీక్షలు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అప్పటి నుంచి ఇది నిరంతరంగా తగ్గుతూ వస్తున్నది. ఆగస్టు 22 న 8 లక్షల పరీక్షలు జరగ్గా.. ఆగస్టు 23 న 6 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. మూడు రోజుల్లో 4 లక్షల టెస్టులు నమోదయ్యాయి. దేశంలో కరోనా వ్యాక్సిన్ కోసం మిషన్ కొవిడ్ భద్రతా పథకాన్ని ప్రవేశ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. బయోటెక్నాలజీ విభాగం తన ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఈ మిషన్ లక్ష్యం దేశంలో కనీసం 6 కరోనా వ్యాక్సిన్లను తయారు చేసి లైసెన్స్ ఇవ్వడం, అలాగే వాటిని మార్కెట్లో ప్రవేశపెట్టడం. అయితే, ఇది ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు.

# హిందువుల పండగలపై ఆంక్షలా

## –శ్రీశైలం ఘటనపై సిబిఐ విచారణ జరపాలి: బండి

నల్లగొండ,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో కేసీఆర్ హిందువుల పండుగలను జరుపుకోనివ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. తెలంగాణని వ్యతిరేకించిన ఎంఐఎంతో పొత్తు పెట్టుకుని తెలంగాణ సమాజాన్ని, హిందువులను అవమానిస్తున్నారన్నారు. నిరంకుశంగా పరిపాలన చేస్తూ రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు.చిట్యాల మండలం పెద్దకాపర్తిలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు తల్లి బక్కమ్మ మృతి చెందింది. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెంకటేశ్వర్లుని పరామర్శించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో వినాయక ఉత్సవాలను నిరంకుశంగా అడ్డుకోవడం దారుణమని అన్నారు. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో ప్రమాద ఘటనలో మృతి చెందిన డిఈ శ్రీనివాస్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రమాదంపై తలెత్తుతున్న అనుమానాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. విద్యుత్ ఉద్యోగుల మృతిపై సీఎం కేసీఆర్ స్పందించక పోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి అహంకారంగా వ్యవహరిస్తున్నారన్నారు. తెలంగాణ. ఏపీ ముఖ్యమంత్రులు కుమ్మకై రాష్ట్రాలను దోచుకుంటున్నారన్నారు. మృతులకు ప్రతి కుటుంబానికి రెండు కోట్ల రూపాయలు ఇవ్వాలన్నారు. సంఘటన పై సీబీఐ విచారణకు అదేశించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు

## –చేపల కోసం వస్తున్న జనాన్ని అడ్డుకున్న పోలీసులు

మంచిర్యాల,ఆగస్టు 25(ఆర్‌ఎన్‌ఎ): సుందిళ్ల బ్యారేజ్ వద్ద చేపల జాతరకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. చేపల కోసం జనం భారీగా తరలిరావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు రంగంలోకి దిగారు. చేపల కోసం వచ్చినవారిని వెళ్లగొట్టారు. సుందిళ్ల బ్యారేజ్‌లో కొట్టుకొచ్చిన చేపల కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనానికి నిరాశ ఎదురైంది. ఎగువన ఉన్న ఎల్లంపల్లి బ్యారేజ్ నుంచి ఇన్‌ఎ÷–లో పెరగడంతో సుందిళ్ల బ్యారేజ్ 7 గేట్లను ఎత్తివేశారు. 3,710 క్యూసెక్కుల నీటిని దిగువనున్న అన్నారం బ్యారేజ్‌లోకి విడుదల చేశారు. దీంతో బ్యారేజ్ దిగువన చేపలను పట్టుకునేందుకు వచ్చిన ప్రజలకు అవకాశం లేకుండా పోయింది. గేట్లను మూసివేస్తే చేపలను పట్టుకోవాలని వందలాదిమంది వేచిచూసినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో వరదలోనూ కొందరు చేపలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జనాల్ని ప్రాజెక్టు పరిసరాలనుంచి వెళ్లగొడుతున్నారు. ఎవరూ ఇక్కడ ఉండవద్దంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# దేశంలో పెరుగుతున్న పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 31 లక్షల మార్కును దాటింది. తాజాగా గత 24 గంటల్లో 60,975 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ మరియు సంక్షేమ శాఖ తెలిపింది. దాంతో మొత్తం కరోనా కేసుల సంఖ్య 31,67,324కి చేరింది. ఇందులో 7,04,348 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో 66,550 మంది ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. దాంతో ఇప్పటివరకు కరోనా బారినపడి కోలుకున్న వారిసంఖ్య 24,04,585గా ఉంది. సోమవారం దేశవ్యాప్తంగా 848 మంది కరోనాతో మరణించారు. దాంతో దేశంలో మొత్తం మరణాల సంఖ్య 58,390కు చేరినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

# కరోనా బారిన పడ్డ స్ప్రింటర్ బోల్ట్

కింగ్‌స్టన్,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): ఒలింపిక్స్‌లో ఎనిమిది బంగారు పతకాలు సాధించిన జమైకా దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ కరోనా మహమ్మారి బారిన పడ్డారు. కోవిడ్ పాజిటివ్ రావడంతో ఉసేన్ బోల్ట్ సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. 'గుడ్ మార్నింగ్.. నాకు కోవిడ్-19 పాజిటివ్‌గా తేలింది. శనివారం చేసిన పరీక్షలో ఇది బయటపడింది. నేను బాధ్యతగా ఉండాలని అనుకుంటున్నాను. అందువల్ల నేను నా స్నేహితుల నుంచి దూరంగా ఉండాలని భావిస్తున్నాను. నాకు ఎలాంటి లక్షణాలు లేవు. అందుకే హోం క్వారంటైన్‌లోకి వెళ్తున్నాను. ఇందుకు సంబంధించిన ప్రొటోకాల్ ఏంటనేది ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుంచి తెలుసుకోవాలని భావిస్తున్నాను. నా ప్రజలు అంతా క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాను' అన్నాడు. కొద్ది రోజుల క్రితమే అనగా ఆగస్టు 21న ఉసేన్ బోల్ట్ తన 34వ పుట్టిన రోజును ఎంతో అట్టహాసంగా జరుపుకున్నారు. ఇందులో ప్రముఖులతో పాటు చాలా మంది పాలుపంచుకున్నారు. అయితే ఈ పార్టీకి హాజరయిన వారు ఎవరూ మాస్కులు పెట్టుకోలేదు. భౌతిక దూరం అనే మాటేలేదు. విచ్చలవిడిగా ప్రవర్తించారని సమాచారం. అయితే, ఇప్పుడు ఉసేన్ బోల్ట్ కరోనా బారినపడటంతో ఆ పార్టీలో పాల్గొన్నవారందరూ ఆందోళనకు గురవుతున్నారు. వారిలో కొందరు సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉండేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆగస్టు 21 న జరిగిన పుట్టినరోజు పార్టీకి మాంచెస్టర్ సిటీ స్టార్ స్టెర్లింగ్, బేయర్ లెవెర్కుసేన్ అటాకర్ లియోన్ బెయిలీ, క్రికెట్ లెజెండ్ క్రిస్ గేల్ హాజరైనట్లు భావిస్తున్నారు. జూన్‌లో టెన్నిస్ స్టార్ నోవాక్ జకోవిచ్‌కి కరోనా పాజిటివ్‌గా తేలింది. ఆ తర్వాత ఈ జాబితాలో చేరిన ప్రముఖ క్రీడాకారుడు బోల్ట్.

# అసోంలో వరద బీభత్సంపై కేంద్ర బృందం పర్యటన

## –బుధవారం నుంచి పర్యటించనున్న అధికారులు

గువాహటి,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): అసోంలో వరద బీభత్సంతో సంభవించిన నష్టాన్ని అంచనా వేయడానికి ఆరుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం బుధవారం నుంచి అసోంలో పర్యటించనున్నట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. ఇటీవల వరదలకు దాదాపుగా 57 లక్షల మంది ప్రభావితమైన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో... మే 22 నుంచి ఆగస్టు 20 మధ్య కాలంలో సుమారు 113 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక అసోంలోని వివిధ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి మరో 26 మంది మరణించారు. జాతీయ రాష్ట్ర రెస్క్యూ దళాలు సుమారు 81 వేల మందిని వరదల నుంచి రక్షించారు. ముప్పై జిల్లాల్లో మొత్తం 2.65 లక్షల హెక్టార్లలో పంటలు వరదలకు తీవ్రంగా దెబ్బ తిన్నాయని అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ(ఏఎస్‌డీఎంఏ) అధికారులు తెలిపారు. ఇక... ప్రపంచ ప్రఖ్యాత కాజీరంగ నేషనల్ పార్కుతో సహా వివిధ అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాల్లో వరదల కారణంగా 18 ఖడ్గమృగాలు, 135 అడవి జంతువులు కూడా వరదల బీభత్సంలో మరణించాయి. కాగా... కేంద్ర బృందం... వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి, నష్టాన్ని అంచనా వేయడంతోపాటు, కేంద్రానికి నివేదించనుంది.

# నాగరాజు కేసులో ఏసిబి దర్యాప్తు వేగవంతం

## –నిందితులను కస్టడీకి కోరిన ఏసిబి అధికారులు

హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్‌ఎన్‌ఎ): కీసర తహసిల్దార్ కేసులో ఏసీబీ దర్యాప్తు వేగవంతం వేసింది. సోమవారం నిందితుల కస్టడీ పిటీషన్‌పై తుది తీర్పు ఏసీబీ కోర్టు ఇవ్వనుంది. నలుగురు నిందితులను నాలుగు రోజుల పాటు ఏసీబీ అధికారులు కస్టడీకి కోరారు. రాంపల్లి దయరా గ్రామంలోని సర్వే నెంబర్ 614 లోని 19 ఎకరాల 39 గుంటల భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్ కోసం తహసీల్దార్ 2 కోట్లు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా కోటి 10 లక్షలు లంచం తీసుకుంటూ తహసిల్దార్ ఏసీబీకి దొరికారు. లంచం ఇచ్చిన కోటి 10 లక్షలు ఎక్కడి నుండి తెసుకొచ్చారనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. కోటి10 లక్షల రూపాయలపై సమాచారం ఇవ్వాలని ఇప్పటికే ఐటి శాఖకు ఏసీబీ లేఖ రాసింది. నలుగురు నిందితులను కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఏసీబీ భావిస్తోంది. ఈ కేసులో ఉన్నతాధికారుల పాత్రపై ఏసీబీ విచారణ చేపట్టింది. నేడు కస్టడీ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు తీర్పు ప్రకటించనుంది. తహసిల్దార్ నాగరాజుకు ముందు నుంచి అవినీతి చరిత్ర ఉందని అధికారులు చెబుతున్నారు. ఆయనపై 2011 జూన్‌లో ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టుకున్న కేసు ఉంది. అప్పట్లోనే నాగరాజు ఇంట్లో కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించారు. ఆయన ఇంట్లో విదేశీ మద్యం బాటిళ్లతో ఓ మినీ బార్ ఉండటాన్ని చూసి అధికారులు తెల్లబోయారు. కొందరు పెద్దల అండదండలతో మూడు నెలల క్రితమే నాగరాజు ఆ కేసు నుంచి విముక్తి పొందాడు. ఏసీబీ అధికారులు కోట్ల రూపాయల్లో అక్రమాస్తుల్ని గుర్తించినా.. క్లీన్‌చీట్ తీసుకోగలిగాడు. అయితే తాజాగా పట్టుబడడంతో ఇప్పుడు విచారణ ఎదుర్కోక తప్పడం లేదు.




గజ్వేల్ సమీపంలోని కొండపోచమ్మ సాగర్‌లో చేపలు వదిలిన మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, హరీష్ రావులు. చిత్రంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి కూడా ఉన్నారు.

# కాళేశ్వరంతో కోనసీమలా పల్లెలు

## కొండపోచమ్మ సాగర్‌లో చేపపిల్లల పెంపకం
## త్వరలోనే రెండో విడత గొర్రె పిల్లల పంపిణీ
## కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, తలసాని

సిద్దిపేట,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, సమృద్ధిగా కురిసిన వర్షాలతో తెలంగాణ పల్లెలు కోనసీమను తలపిస్తున్నాయని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. కొండ పోచమ్మసాగర్‌లో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం, చేపలు విడుదల చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. ఈ యేడు కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో 7.5 టీఎంసీ ల నీటిని నింపుతామని పేర్కొన్నారు. కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్ లో 14 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తామన్నారు. ప్రతి చెరువు, చెక్ డ్యాం, రిజర్వాయర్‌లలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాబోయే రోజుల్లో రొయ్యలను కూడా జలాశయాల్లో పెంచుతామన్నారు.

జిల్లాలోని గౌరారం మండల కేంద్రంలో జాతీయ కృత్రిమ గర్భధారణ రెండో దశ కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మంత్రి హరీశ్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ..సిద్దిపేట నమూనాగా అన్ని జిల్లాల్లో గొర్రెల షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. అలాగే రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. డీడీలు కట్టిన వారందరికీ గొర్రెల పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. పాడి పై ఆధారపడిన వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని పేర్కొన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. నరేగా కింద అర్హులైన వారందరికీ పశు వులు, గొర్రెల షెడ్లను మంజూరు చేస్తామని మంత్రి తలసాని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సిద్దిపేట పట్టణంలోని బారాయిమామ్ చిన్నమసీదు సమీపంలో మంగళవారం రూ.25 లక్షల వ్యయంతో నిర్మించ నున్న పద్మశాలీ సమాజ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, స్థానిక కౌన్సిలర్లు, పద్మశాలీ సమాజ సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రానికి, గజ్వేల్ మండలం ముట్రాజ్ పల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు ప్రారంభోత్సవం చేశారు.

# జిల్లాల్లో పెద్ద ఎత్తున చేపల పెంపకం

## మత్స్యకారుల్లో వెల్లివిరుస్తోన్న ఆనందం

వరంగల్,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ): జిల్లాల్లో అనేక చెరువు÷-లోల పెద్ద ఎత్తున చేపల పెంపకం మొదలయ్యింది. ఇటీవలి వర్షాలకు చెరువులు, ప్రాజెక్టులకు జలకళ రావడంతో చేపలను వదిలే కార్యక్రమం సాగుతోంది. మంత్రి తలసాని చేపపిల్లలను మైలారం చెరువులో వదిలారు. ఈమేరకు అన్ని జిల్లాల్లో చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఏర్పాట్లు చేసింది.

ఈ ఏడాది కొంత ఆలస్యమైనప్పటికీ వచ్చే నెలాఖరులోగా లక్ష్యం మేరకు సీడ్ పోసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా మత్స్యకారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రతి చెరువు, రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదలకు మత్స్యశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈమేరకు అన్ని జిల్లాల్లో పిల్లల్ని పంపిణీ చేపట్టారు.

మత్స్యశాఖ అధికారులు వానకాలం ఆరంభంలో గుత్తేదార్లను ఎంపిక చేసి ఆయా చెరువు, రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతారు. ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి ఉచిత చేప పిల్లలను పోయాలని ప్రభుత్వం నిర్ణయించి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటీవల మత్స్యశాఖ ఈ జిల్లాల్లోని వదలాల్సిన చేప పిల్లల సరఫరా కోసం టెండర్లు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నారు. వరంగల్ రూరల్ జిల్లాలో ఈ ఏడాది 2.52 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం జిల్లాలో 849 చెరువులు, 2 రిజర్వాయర్లు ఉన్నాయి. రిజర్వాయర్లలో ఒకటి మైలారం, రెండోది చలివాగు ప్రాజెక్టు. గతేడాది 810 చెరువులు, రిజర్వాయర్లలోనే 2.20 కోట్ల చేప పిల్లలను వదిలారు.

ఈసారి లక్ష్యానికి అనుగుణంగా పిల్లలను పోసేందుకు ప్రణాళిక రూపొందించారు. రిజర్వాయర్లలో బొచ్చె, రవ్వు, మెరిగె రకాలను వదలనున్నారు. అలాగే చెరువుల్లో బొచ్చె, రవ్వుతో పాటు బంగారుతీగ చేప పిల్లలు పోయాని నిర్ణయించారు. ఇందుకుగాను చేప పిల్లలను సరఫరా చేసేందుకు ముగ్గురు కాంట్రాక్టర్ల టెండర్లను ఖరారు చేశారు. గతేడాది 4.26 కోట్ల పిల్లలను వేసిన అధికారులు ఈసారి అదనంగా 26 లక్షల చేపలను వదలనున్నారు. వచ్చే నెలాఖరులోగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో 150 మత్స్యకార సంఘాలు 9,827 మంది సభ్యులున్నారు. గతంలో చేప పిల్లల పెంపకం తక్కువగా ఉండగా ప్రభుత్వం వంద శాతం రాయితీతో నాణ్యమైన పిల్లల్ని పంపిణీ చేస్తుండడంతో మత్స్యకారుల ఆదాయం రెట్టింపయ్యింది.

# తొలిదశ ఉద్యమకారుడు సురవరం

## విగ్రహ ఏర్పాటకు శంకుస్థాపనలో మంత్రి నిరంజన్

వనపర్తి,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ): తెలంగాణ తొలి దశ ఉద్యమ నాయకుడు సురవరం ప్రతాప్ రెడ్డి అని, ఆయన పోరాటం చరస్మరణీయమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సురవరం ప్రతాపరెడ్డి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ తొలి దశ ఉద్యమ నాయకుడు సురవరం ప్రతాప్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయన స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమం సాగిందన్నారు. భవిష్యత్ తరాలకు ఆయన జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. 400 పేజీలతో ఆయన జీవిత చరిత్ర సంపుటి ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇది సురవరం మీద అధ్యయనం చేసేందుకు ఈ సంకలనం ఉపయోగపడుతుందన్నారు. వనపర్తి శాసనసభ్యుడిగా సురవరం కొద్ది కాలమే పని చేసినా ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. దీనికి సహకరిస్తున్నసాహితీవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. సెప్టెంబర్ 9న కాంస్య విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రాష్ట్రంలోని కవులు, కళాకారులు, సాహితీవేత్తలను ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, ప్రజాప్రనిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బాసరలో బాలుడి మృతదేహం లభ్యం

## దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నిజామాబాద్,ఆగస్టు 25(ఆర్ఎన్ఎ): బాసరలో లభ్యమైన బాలుడి మృతదేహానికి.. నిజామాబాద్‌లో బాలుడి కిడ్నాప్‌నకు లింకుపై పోలీసులు ఆరా తీశారు. ఆగస్ట్ 19న నాగరాజు అనే వ్యక్తి ఓ బాలుడి మృతదేహాన్ని తీసుకొచ్చి రైల్వేస్టేషన్ సమీపంలో పడేసినట్టు సీసీ కెమెరాలో దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. బాలుడిని చంపి ఇక్కడికి తీసుకొచ్చి పడేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. బాలుడి శవాన్ని పడేసిన వ్యక్తి.. నిజామాబాద్‌లో పట్టుబడ్డ నాగరాజు ఒక్కడే అని పోలీసులు భావిస్తున్నారు.

# షూటింగ్‌లకు పర్యాటక ప్రాంతాలను వినియోగించండి

## -సినీ నిర్మాతలతో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కేంద్రం సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇచ్చినందున తెలంగాణ పర్యాటక ప్రాంతాల్లో షూటింగ్‌లు జరుపుకోవాలని టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దీంతో పర్యాటక అభివృద్ధితో పాటు, ఈ ప్రాంతాల వారికి ఉపాధి కలుగుతుందని మంత్రి అన్నారు. ఈ మేరకు కరోనా పరిస్థితుల మధ్య సినిమా షూటింగ్స్‌కి సంబంధించి పలువురు నిర్మాతలతో టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యంగా షూటింగ్ లొకేషన్లపై ప్రముఖంగా చర్చ జరిగింది. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'తెలంగాణలో షూటింగ్‌కి సంబంధించిన అనేక ప్రాంతాలున్నాయి. ఆదిలాబాద్, వికారాబాద్, కుంతలా, భోగతా జలపాతాలు వంటి దాదాపు 50-60 లొకేషన్లు తెలంగాణలోనే ఉన్నాయి. ఇక్కడ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని నిర్మాతలు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో షూటింగ్స్‌కి సంబంధించిన నివేదికను 15 రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందిస్తాం' అని తెలిపారు. కరోనా నేపథ్యంలో ఇతర దేశాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని పలువురు ప్రముఖులు ఇటీవల మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లోనే మంచి లొకేషన్లు ఉన్నాయని, అంతేకాకుండా వీటి వల్ల బడ్జెట్ కూడా తగ్గుతుందని పలువురు నిర్మాతలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తెలంగాణలోని లొకేషన్స్‌ని పరిశీలించి సినీ ప్రముఖులు త్వరలోనే కేటీఆర్‌తో మరోసారి సమావేశం కానున్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం షూటింగులకు అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కొంత భాగం చిత్రీకరణ ఉన్నవి, చిన్న సినిమాలు షూటింగ్స్ మొదలుపెట్టాయి. ప్రస్తుతం పెద్ద సినిమాల షూటింగ్‌లు సైతం సెప్టెంబరు నుంచి తిరిగి ప్రారంభంకానున్నాయి

# మామునూరులో విమానసేవలు ప్రారంభించండి

## రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు విడుదల చేయండి
## కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్‌ను కోరిన కేటీఆర్

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కేంద్రం నుంచి తెలంగాణ పురపాలక శాఖకు రావాల్సిన బకాయిలు రూ.2,537.82 కోట్లు విడుదల చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి, విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని మంత్రి కేటీఆర్ కోరారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో కలిసి ఢిల్లీలో కేంద్రమంత్రితో కేటీఆర్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి, విమానయాన శాఖకు సంబంధించిన అంశాలను హర్దీప్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి అధికారులకు సూచించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం నుంచి స్వచ్ఛ భారత్ నిధులు రూ.217కోట్లు, అమృత్ రూ.351కోట్లు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ కింద రూ.783 కోట్లు రావాల్సి ఉందని.. వాటిని విడుదల చేయాలని కోరామన్నారు. పట్టణాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి రూ.1,184 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టును ఉడాన్ పథకంలో చేర్చాలని కోరినట్లు కేటీఆర్ తెలి పారు. 10 రోజుల్లో సర్వేకోసం కేంద్ర బృం దాన్ని పంపుతామని కేంద్రమంత్రి తెలిపాం"ని.. త్వరలోనే వరంగల్ ప్రజలకు విమానసేవలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నామన్నారు. అక్టోబర్‌లో మరోసారి పూర్తి నివేదికతో రావాలని కేంద్రమంత్రి సూచించారని, 15వ ఫైనాన్స్ నిధులు రూ.784 కోట్లు విడుదల చేయాలని కోరానని పేర్కొన్నారు.

# మానవీయతకు నిలువెత్తు రూపం 'మదర్ థెరీసా'

**(26 ఆగష్టు మదర్ థెరీసా 110వ జయంతి సందర్భంగా)**



26 ఆగష్టు 1910న స్కోప్జె పట్టణం, అల్బేనియాలో నికోలె మరియు డ్రానఫైల్ బొజాక్షిహ్యు దంపతులకు జన్మించిన మదర్ థెరీసా అసలు పేరు 'అగ్నెస్ గోంక్శే బొజాక్షిహ్యు'. ఆమె రోమన్ క్యాథలిక్ చర్చి ద్వారా 'సేయింట్ థెరిసా ఆఫ్ కలకత్తా' గౌరవాన్ని పొందారు. 27 ఆగష్టున క్రైస్తవ మతాన్ని(బాప్టిజం) స్వీకరించిన థెరీసా తన అసలు పుట్టిన రోజుగా ప్రకటించుకున్నారు. తన 18వ ఏటనే ఇంటిని వదిలి 'సిస్టర్స్ ఆఫ్ లొరెంటో' ప్రచార సంఘంలో చేరి, స్వల్పకాలం ఐర్లాండ్‌లో తరువాత 1929లో ఇండియాకు చేరి తన జీవన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1950లో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'ని స్థాపించి నాయకత్వం వహిస్తూన్న మదర్ థెరీసా 133 దేశాలలో 4,500 సన్యాసినుల(నన్స్)తో పేదలకు, రోగగ్రస్థులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్న వారికి పరిచర్యలు చేస్తూ 45 సంవత్సరాలు సేవా కార్యక్రమాలను కొనసాగించారు. హెచ్ఐవి/ఏయిడ్స్, కుష్టు, క్షయ వ్యాధిగ్రస్థులకు ఆశ్రమాలు నెలకొల్పి వారికి మరియు వారి కుటుంబాల పిల్లలకు మరియు అనాథలకు వైద్య, భోజన మరియు విద్యను ఉచితంగా అందించే సేవలు చేశారు. తన జీవితాన్ని అభాగ్యుల సంక్షేమానికి అంకితం చేసిన మదర్ సేవను గుర్తించమన అంతర్జాతీయ సమాజం 1979లో 'నోబెల్ శాంతి బహుమతి', 1962లో 'రామన్ మెగసెసె శాంతి బహుమతి' పొంది ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. భారత ప్రభుత్వ 'పద్మశ్రీ', 'జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన పురస్కారం', 1980లో 'భారతరత్న' లాంటి అనేక అత్యున్నత పురస్కారాలు థెరిసాను వరించాయి. చిరుప్రాయం 12వ ఏటనే సేవారంగం పట్ల ఆకర్షితురాలైన థెరిసా తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు.

1929లో ఇండియాకు చేరి డార్జిలింగ్‌లో బెంగాలీ భాష నేర్చుకొని సెయింట్ థెరీసా పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. 24 మే 1931 రోజున ప్రముఖ 'మిషనరీస్ సన్యాసిని థెరిసా' జీవితానికి ఆకర్షితురాలై తన పేరును థెరీసాగా మార్చుకొని సన్యాసినిగా మారారు. 14 మే 1937 నుండి తూర్పు కలకత్తాలోని లొరెంటో కాన్వెంట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా 20 సంవత్సరాలు సేవలు అందించారు. 1943లో కలకత్తా పేదల దుస్థితి మరియు ఎదుర్కొన్న కరువు కారణంగా నిరుపేదల వ్యథలను చూసి చలించి పోయారు. పేదలు, రోగుల దుస్థితిని ప్రత్యక్షంగా చూచిన థెరీసాలోని మానవీయత ఉబికి తన ఉపాధ్యాయ వృత్తిని వదిలి, 07 అక్టోబర్ 1950లో వాటికన్ మతగురువు అనుమతితో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'ని రూపొందించారు. తన నిస్వార్థ సేవలను గుర్తించిన జోసెఫ్ లాంగ్‌ఫోర్డ్ ఆనందం వ్యక్తం చేస్తూ 'మదర్ థెరీసా' అని సంభోదించడం ప్రారంభించారు. భారతీయ పౌరసత్వం పొందిన థెరీసా నీలి అంచుగల తెల్ల చీరను ధరించటం అలవాటు చేసుకున్నారు. వైద్య శిక్షణ పొందిన తరువాత మరి కొంత మంది యువతుల సహాయంతో నిరుపేద పిల్లలకు పాఠశాలలు మరియు అనాథాశ్రమాలు నిర్వహించడమే తన మార్గమని ప్రతిన బూనారు. 1952లో కలకత్తాలో శిథిల స్థితిలో ఉన్న హిందూ ఆలయాన్ని 'నిర్మల హృదయ్' పేరుతో వృద్ధాశ్రమంగా మార్చారు. నిరుపేదలకు ఉచిత ఆసుపత్రులు నెలకొల్పి వైద్యసేవలన విస్తరించారు. 'శాంతి నగర్' పేరుతో కుష్టు రోగులకు ఆసుపత్రి స్థాపించి వైద్య మరియు భోజన వసతులు కల్పించారు. 1955లో 'నిర్మల్ శిశు భవన్' ప్రారంభించి నిరుపేద మరియు అనాథల పిల్లలకు విద్య మరియు వైద్య సదుపాయాలు అందించారు.

థెరీసా సేవలను గుర్తించిన పౌరసమాజ విరాళాలతో దేశవ్యాప్తంగా పేద పిల్లలకు అనాథాశ్రమాలు మరియు పాఠశాలలు స్థాపించారు. మతమార్పిడులు ప్రోత్సహించడం మరియు పేదరికం పట్ల మత విశ్వాసాలు కలిగిన కారణంగా హిందూ సంఘాల విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.

1965 నుండి అమెరికా, ఇటలీ, వెనెజ్యులా, టాంజానియా, ఆస్ట్రియా లాంటి అనేక దేశాలలో తన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 'అల్బేనియన్ రక్తం, భారత పౌరసత్వం, క్యాథలిక్ సన్యాసత్వం కలిగి క్రీస్తుకు తన హృదయాన్ని సమర్పిస్తున్నానని' వెల్లడించారు మదర్ థెరీసా. 05 సెప్టెంబర్ 1997 రోజున హృద్రోగ సమస్యతో కన్ను మూసిన థెరీసా ప్రపంచ అత్యుత్తమ సేవామూర్తిగా కొనియాడబడ్డారు. ఆ రోజుకి మిషనరీస్ ఆఫ్ చారిటీ నేతృత్వంలో 4000 మంది నన్స్, 300 బ్రదర్స్ సేవలతో 123 దేశాలలో 610 అనాథాశ్రమ కేంద్రాలు పని చేసేలా సేవాసామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆమె మరణానంతరం పోప్ జాన్ పాల్-ఎఎ చేత 'బ్లెస్డ్ థెరీసా ఆఫ్ కలకత్తా'అత్యున్నత బిరుదును పొందారు. బెంగాలి, హిందీ, ఇంగ్లీష్, అల్బేనియా మరియు సెర్బియా భాషలు మాట్లాడగల మదర్ థెరీసా జీవితంలో క్షణక్షణం, శరీరంలోని కణకణం అభాగ్య నిరుపేదలకు అంకితం చేస్తూ అసమాన మానవీయ సేవలు విశ్వ మానవాళికి అందించారు. మదర్ చూపిన బాటను అనుసరిస్తూ, మానవ కళ్యాణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని సేవానిరతిని ప్రదర్శిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కరోనాతో మేదాంతలో చేరిన శిబూసోరెన్

రాంచీ,ఆగస్ట్ 25(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత శిబూసోరేన్ ఆసుపత్రిలో చేర్పించారు. కరోనా పాజిటివ్ రావడంతో ఆయన్ను రాంచీలోని మేదాంత ఆసుపత్రికి తరలించారు. శిబూసోరేన్‌తో పాటు ఆయన భార్యతో సహా మొత్తం ఏడుగురికి పాజిటివ్ వచ్చింది. జార్ఖండ్‌లో ప్రస్తుతమున్న సంకీర్ణ సర్కారులో జేఎంఎం కీలక భాగస్వామి. శిబూసోరేన్ కుమారుడు హేమంత్ సోరేన్ ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్నారు.

శిబూసోరేన్ వయసు 76 సంవత్సరాలు. గతంలో జార్ఖండ్ సీఎంగా, కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన జార్ఖండ్ ప్రత్యేక ఉద్యమ సారధిగా రాష్ట్రాన్ని సాధించారు.

# ఇజ్రాయిల్‌లో పురాతన బంగారు నాణాలు లభ్యం

జెరూసలెం,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): వెయ్యి సంవత్సరాలకు పూర్వం నాటి బంగారు నాణెళిలను ఇజ్రాయెల్‌లో కనుగొన్నారు. కొంత మంది యువకులు ఆగస్టు 18న చేసిన తవ్వకాల్లో ఇవి బయటపడ్డట్టు ఇజ్రాయెల్‌కు చెందిన పురావస్తు శాఖ ప్రకటించింది. అయితే మళ్లీ తిరిగి పొందే ఉద్దేశంతో ఈ నిధిని పాతిపెట్టి ఉండవచ్చని అనుమానిస్తోన్న ఇజ్రాయెల్ పురావస్తు శాఖ వాస్తవాలు ఇంకా తెలియాలని స్పష్టం చేసింది.

నిధిని ఎవరు దాచారు? ఆ నిధి యజమాని ఎవరనే విషయం తెలియదని తవ్వకాలు జరిపిన వ్యక్తులు అన్నారు. 'నేను తవ్వుతున్నప్పుడు చాలా సన్నని ఆకులు కనిపించాయి. వాటిని కాస్త ఆడించి చూసినప్పుడు మెరుస్తూ కనిపించాయి. అవి బంగారు నాణెళిలు అని గుర్తుపట్టాం. ఇంత ప్రత్యేకమైన, పురాతనమైన నిధిని కనుగొనడం చాలా ఆనందంగా ఉంది' తవ్వకాలు జరిపిన వ్యక్తుల్లో ఒకరైన ఓజ్ కోహేర్ అనే వ్యక్తి అన్నారు. తొమ్మిదవ శతాబ్దానికి చెందిన అబ్బాసిడ్ కాలిఫేట్ కాలంలో 24-క్యారెట్ల స్వచ్ఛమైన బంగారు నాణెళిలు విరివిగా అందుబాటులో ఉండేవని యాంటిక్విటీస్ అథారిటీ నాణెం నిపుణుడు రాబర్ట్ కూల్ చెప్పారు.

# మారని కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాలు

## టీకప్పులో తుఫాన్‌లా ముగిసిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ
## మళ్లీ సోనియానే అధ్యక్షురాలుగా కొనసాగిస్తూ తీర్మానం
## నేతల లేఖపై సుదీర్ఘంగా చర్చించిన సమావేశం
## సోనియా లేదా రాహుల్ కొనసాగాలని మెజార్టీ నేతల పట్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలిగా మరికొంత కాలం పాటు సోనియా గాంధీనే కొనసాగనున్నారు. సీడబ్ల్యూసీ భేటీలో సుదీర్ఘ సమయం పాటు చర్చించిన నేతలు పార్టీ సారథ్య బాధ్యతలు ఎవరికి ఇవ్వాలనే అంశంపై చర్చించారు. ఎక్కువ మంది నేతలు సోనియానే కొనసాగాలనీ.. అనారోగ్య సమస్యలు ఉంటే ఆ బాధ్యతలు రాహుల్‌కి అప్పగించాలని కోరినట్టు తెలుస్తోంది. నాటకీయ పరిణామాల మధ్య కొనసాగిన ఈ సీడబ్ల్యూసీ భేటీలో మళ్లీ సోనియాగాంధీనే తాత్కాలిక అధ్యక్షురాలిగా కొనసాగేలా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు తథ్యంగా కనిపిస్తోందన్న చర్చోపచర్చల నేపథ్యంలో నాటకీయ పరిణామాల మధ్య జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశం సాగింది. ప్రస్తుతానికి సోనియా గాంధీనే తాత్కాలిక అధ్యక్షురాలిగా కొనసాగాలని పార్టీ ముఖ్య నేతలంతా సీడబ్ల్యూసీలో తీర్మానించారు. రాబోయే 6 నెలల్లో పార్టీ కొత్త చీఫ్‌ను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. దీంతో.. నాయకత్వ బాధ్యతల నుంచి సోనియా తప్పుకోనున్నారన్న వార్తలకు తెరపడింది. సోనియా రాజీనామా చేశారని, ఇక రాహుల్ సారథ్యంలో కాంగ్రెస్ ముందుకెళ్లనుందనే వార్తలు తెరపైకొచ్చాయి. అయితే.. సీడబ్ల్యూసీ తాజా ప్రకటనతో ప్రస్తుతానికి ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తేలిపోయింది. మొత్తంగా టీకప్పులో తుఫాన్‌లా కాంగ్రెస్ సమావేశం ముగిసింది. సోనియా రాజీనామాను మన్మోమన్ సింగ్, ఆంటోనీలు వ్యతిరేకించి ఆమెనే సారథిగా కొనసాగాలని అభ్యర్థించారు. మరోవైపు ఏఐసీసీ అధ్యక్షురాలిగా సోనియా గాంధీనే కొనసాగాలని పార్టీ సీనియర్ నాయకుడు, కర్నాటక ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అత్యున్నత పదవిని చేపట్టేలా అవసరమైతే రాహుల్ గాంధీని ఒప్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీకి లేఖ రాశారు. పార్టీకి పూర్తిస్థాయి సారథిని నియమించాలనీ.. సీడబ్ల్యూసీ ఎన్నికలు నిర్వహించడం సహా పార్టీ పార్లమెంటరీ బోర్డు పునర్నించాలని కోరుతూ 20 మంది సీనియర్ నేతలు సోనియాకు లేఖ రాయడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పార్టీ నాయకత్వంలో ఉమ్మడి భాగస్వామ్యం ఉండాలని కొందరు డిమాండ్ చేస్తుండగా.. మరికొందరు గాంధీ కుటుంబమే సారథ్యం వహించాలని పట్టుపడుతుండడంతో మరింత గందరగోళం నెలకొంది. గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో... తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియా గాంధీ కొనసాగుతున్నారు. ప్రస్తుతం తన ఆరోగ్యం సహకరించడం లేదంటూ సోనియా తప్పుకోవడంతో మళ్లీ కాంగ్రెస్ పార్టీ కొత్త చీఫ్‌గా ఎవరు వస్తారన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఈ పదవిని చేపట్టేందుకు రాహుల్, ప్రియాంక గాంధీలు ఇప్పటికే విముఖత వ్యక్తం చేయడంతో కొత్త సారథి ఎంపిక కత్తిమీద సాములా మారిన సమయంలో మరో ఆరునెలలపాటు సోనియానే కొనసాగనున్నారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి జరిగిన సుదీర్ఘ భేటీ అనంతరం సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారని అంతా భావించినప్పటికీ.. నాయకత్వ మార్పు అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం గమనార్హం. ఉదయం నుంచి అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధ్యక్షురాలిగా తాను కొనసాగలేననీ.. మరొకరిని నియమించాలని సోనియాగాంధీ సీడబ్ల్యూసీ సమావేశంలో నేతలను కోరారు. అయితే, ఆమె కోరిన వెంటనే మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్ వంటి సీనియర్ నేతలు ఆ పదవిలో సోనియానే కొనసాగాలని కోరారు. ఈ అంశంపై చర్చించిన నేతలు పూర్తిస్థాయి నిర్ణయం తీసుకోకముందే మరో అంశంపై చర్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

మరోవైపు, 23మంది కాంగ్రెస్ సీనియర్ నేతలు ఇటీవల సోనియాకు రాసిన సుదర్ఘలేఖపై సమావేశంలో పెద్ద దుమారమే చెలరేగింది. పార్టీలో నాయకత్వ లోపం, నిర్ణయాల లేమి తదితర అంశాలపై నేతలు రాసిన లేఖపై చర్చించిన నేతలు తుది నిర్ణయానికి రాలేకపోయారు. ఈ లేఖపైనే దృష్టి పెట్టిన ఈ భేటీలో రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. పలు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలను పడగొట్టేందుకు ఇతర పార్టీల కుట్రలు చేస్తున్న సమయంలో; సోనియా ఆస్పత్రిపాలైన నేపథ్యంలో సీనియర్లు, పార్టీలో కీలక పదవులు అనుభవించిన నేతలు ఈ రకంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించారు. లేఖలు రాసేటప్పుడు సమయం, సందర్భం చూసుకోవద్దా? అని అన్నారు. సోనియా ఏ నిర్ణయమూ తీసుకోవడానికి అవకాశం లేని సమయంలో లేఖ రాసి ఆమెను మానసికంగా ఇబ్బంది పెట్టారంటూ వ్యాఖ్యానించారు. ఒకానొక దశలో భాజపా ప్రోద్బలంతో ఇలాంటి లేఖలు రాశారా? అని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు కూడా వార్తలొచ్చాయి. అయితే, రాహుల్ అలాంటి వ్యాఖ్యలు చేయలేదని అవి తప్పని గులాం నబీ ఆజాద్ వెల్లడించారు. అయితే, సోనియా గాంధీ ఎప్పటి వరకు అధ్యక్ష బాధ్యతల్లో ఉంటారు అనేది మాత్రం స్పష్టంచేయలేదు. కొన్ని నెలల పాటు అని మాత్రమే తీర్మానంలో పేర్కొన్నారు. కొత్త అధ్యక్షుడు, పార్టీలో తీసుకోవాల్సిన నాయకత్వ మార్పు, క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ స్థాయి వరకు చేయాల్సిన మార్పులు, చేర్పులు, పార్టీ తదుపరి కార్యాచరణ తదితర అంశాలపై చర్చించిన సీడబ్ల్యూసీ మరికొంత కాలం పాటు సోనియానే కొనసాగించాలని నిర్ణయించినట్టు స్పష్టంచేసింది. కొత్త అధ్యక్షుడు గాంధీ కుటుంబం నుంచా గాంధీయేతర కుటుంబం నుంచి వస్తారా అనే అంశంపైనా స్పష్టమైన వైఖరి తీసుకోలేదు. మరోసారి సీడబ్ల్యూసీ మరోసారి భేటీ అయ్యే ఆస్కారం ఉంది. నూతన అధ్యక్షుడి ఎంపిక జరిగే వరకు సోనియానే తాత్కాలిక అధ్యక్షురాలిగా కొనసాగనున్నారు. ఉదయం నుంచి జరిగిన వ్యవహారాలన్నింటిపైనా స్పష్టమైన నివేదికను తయారు చేయబోతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

రక్తంతో సోనియాకు లేఖ

రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీకి తిరిగి అధ్యక్షుడిగా నియమించాలని పార్టీకి చెందిన ఓ నేత.. సోనియా గాంధీకి రక్తంతో లేఖ రాశారు. ఢిల్లీలోని కంటోన్మెంట్ బోర్డ్ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత సందీప్ తన్వార్ రాసిన ఈ లేఖ ప్రస్తుత రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. రాహుల్ గాంధీని పార్టీకి శాశ్వత అధ్యక్షుడిగా నియమించాలని రక్తతర్పణం చేసి అడుగుతున్నాను. రాహుల్ గాంధీ కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు దేశంలో ఎన్నో గొంతుకలు నినదిస్తున్నాయి. రాహుల్ గాంధీ కనుక పార్టీ అధ్యక్షుడు కాకపోతే కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రమూ మేలు చేయదని సందీప్ తన్వార్ రాసుకొచ్చారు.

# జిల్లా ఆస్పత్రిలో కరోనా రోగులకు మంత్రలు పరామర్శ

మహబూబాబాద్,ఆగస్ట్25(ఆర్ఎన్ఎ): జిల్లా దవాఖాను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సందర్శించారు. కొవిడ్ వార్డులో కరోనా బాధితులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడకుండా ధైర్యంగా కరోనాను ఎదుర్కోవాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ అంగోతు బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, కలెక్టర్ వీపీ గౌతం, అడిషనల్ కలెక్టర్, వైద్యశాఖ అధికారులతో కలిసి జిల్లాలో కరోనా స్థితిగతులు, వైరస్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com